



# విజయభాను




విశాఖపట్నం, గురువారం 05-04-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 202 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# వివక్ష ఎందుకు?

- ఏపీకి హామీలు ఇచ్చి అమలు చేయరా?
- న్యాయం ఎక్కడ? ప్రజలు విసుగెత్తిపోతున్నారు
- కేంద్ర సాయమందకుంటే రాష్ట్ర మనుగడ కష్టం
- మద్దతు తెలుపుతున్న నేతలకు ధన్యవాదాలు
- జాతీయ మీడియాతో ఏపీ సీఎం చంద్రబాబు



ఢిల్లీ : పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై లేదా అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నష్టాన్ని కేంద్రమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జాతీయ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఏపీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు కలిగిన నష్టాన్ని కేంద్రమే భర్తీ చేయాలి. దీని కోసం అనేక సార్లు విజ్ఞప్తి చేశా. 29 సార్లు ఢిల్లీకి వచ్చా. ప్రధానిని, మంత్రులను కలిసి తరువాయి 2లో

# అంబేద్కర్ మార్గం సదా అనుసరణీయం

### ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలోనే తన ప్రభుత్వం నడుస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అంబేద్కర్‌ను గౌరవించడంలో ఇతర ప్రభుత్వాలేవీ తన ప్రభుత్వానికి సాటి రావన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలకు మూలం శాంతి, కలుపు గోలుతనమని చెప్పారు. అత్యంత నిరుపేదల కోసం పని చేయడమే తన లక్ష్యమని తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ పేరు చెప్పుకుంటూ రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రశాంతంగా ఉండాలని కోరారు. సుప్రీంకోర్టు గత నెల 20న ఇచ్చిన తీర్పులో ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం నమోదయ్యే కేసుల్లో నిందితులను ఆటోమేటిక్‌గా అరెస్టు చేయరాదని తెలిపింది. దీంతో ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన చెందారు.

# స్వార్థం కోసమే బాబు దిల్లీ పర్యటన



గుంటూరు: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దిల్లీకి వెళ్లింది ప్రత్యేక హోదా కోసం కాదని.. వ్యక్తిగత స్వార్థం కోసమని వైకాపా అధ్యక్షుడు జగన్ ఆరోపించారు. తన అవినీతిపై కేంద్రం విచారణ చేస్తుందనే భయంతో.. చంద్రబాబు అన్ని పార్టీల మద్దతు కోరేందుకు దిల్లీ వెళ్లారని విమర్శించారు. కేంద్రం విచారణ చేపడితే ... తన తరఫున ఎంపీలు పోరాటం చేసేందుకే వారితో రాజీనామాలు చేయించడం లేదని జగన్ ఆక్షేపించారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా గుంటూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జగన్ పాల్గొన్నారు. ప్రత్యేక హోదా కోసం దిల్లీ వెళ్తున్నట్టు చంద్రబాబు చెబుతున్నారని.. పార్లమెంట్ సమావేశాలు రెండ్రోజుల్లో ముగిసే దశలో దిల్లీ వెళ్లి ఏం లాభమని ప్రశ్నించారు. గుంటూరులో అతిసారం మరణాలు ప్రభుత్వ వైఫల్యమేనన్న జగన్... బాధితులకు పరిహారం ఇవ్వడంలోనూ అలసత్వాన్ని ప్రదిర్శంచారని ఆక్షేపించారు. 20 మంది చనిపోతే కేవలం ఆరుగురికి తరువాయి 2లో

# అలీనోద్యమ సదస్సుకు సుష్మా స్వరాజ్ పయనం



న్యూఢిల్లీ : విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ బుధవారం అజర్‌బైజాన్ వెళ్ళారు. అలీనోద్యమ దేశాల మంత్రుల సదస్సులో ఆమె పాల్గొంటారు. ఈ పర్యటన మూడు రోజుల పాటు సాగుతుంది. సుస్థిర అభివృద్ధి కోసం అంతర్జాతీయ శాంతి, భద్రతలకు మద్దతు ఇతివృత్తంతో ఈ నెల 5-6 తేదీల్లో ఈ సదస్సు జరుగుతుంది. అజర్‌బైజాన్ విదేశాంగ మంత్రి ఎల్మార్ మమ్మదియరోవ్‌తో బుధవారం సుష్మా స్వరాజ్ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పరస్పరం ఆసక్తిగల ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై వీరు చర్చిస్తారని పేర్కొంది.

ఇంధనం, రవాణా, సామర్థ్య నిర్మాణం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని వృద్ధి చేసుకునేందుకు ఈ చర్చలు దోహదపడతాయని తెలిపింది. చారిత్రక, సాంస్కృతిక సంబంధాల ఆధారంగా భారతదేశం, అజర్‌బైజాన్ మధ్య స్నేహం వృద్ధి చెందుతోంది.

# కొనసాగుతున్న సభలు

- రోజు రోజుకూ వాయిదాలే
- మీరు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారు
- శాంతించండి.. చర్చలకు సహకరించండి
- మీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు
- రాజ్యసభలో సభ్యుల తీరుపై వెంకయ్యనాయుడు అసంతృప్తి
- ఆందోళనల మధ్యే స్పీకర్ చేపట్టిన ప్రశ్నోత్తరాలు
- ఉభయ సభలు గురువారానికి వాయిదా





దిల్లీ: సభా సమావేశాలు ప్రారంభమైన దగ్గర నుంచి ఎటువంటి చర్చలు జరగనీయకుండా ఆందోళన చేయడాన్ని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు తప్పుబట్టారు. సభ్యులు సమావేశాలను జరగకుండా చేస్తుండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం రాజ్యసభ ప్రారంభమైన కొద్ది సేపటికి కొత్తగా ఎన్నికైన 12 మంది రాజ్యసభ ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అన్నాడీఎంకే నేతలు, తెలుగుదేశం ఎంపీలు ఆందోళనకు దిగారు. సభ వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళన చేస్తుండటంతో విసిగిపోయిన వెంకయ్యనాయుడు సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.

సభలో ఎటువంటి బిల్లులు పాస్ అవడం లేదు. దేశం అభివృద్ధిని కోరుకుంటుంది. మీరు దేశ ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారు. శాంతించండి.. చర్చలకు సహకరించండి. దేశ ప్రజల పరిస్థితిని అర్థం చేసుకోండి. ప్రతీ అంశంపై చర్చించడానికి అనుమతి ఇచ్చాను. కానీ తరువాయి 2లో

## ఆర్టీసీ ఛార్జీలు పెంచే
# ఆలోచన లేదు

10 శీతల బస్సులు ప్రారంభం

కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రతకు టీడీపీ ప్రాధాన్యం

రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రహదారి రవాణా సంస్థలో నియామకాలకు ఆస్కారం లేకుండా తీసుకువచ్చిన సర్క్యులర్ 7ను నిలిపివేయాలని అధికారుల్ని ఆదేశించినట్లు రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఆర్టీసీ కొత్తగా కొనుగోలు చేసిన 10 శీతల బస్సులను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండులో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి... కార్మికుల సంక్షేమానికి, ఉద్యోగ భద్రతకు తమ తరువాయి 2లో

## తెదేపా ఎంపీల ఆందోళన

దిల్లీ: ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించడంతో పాటు విభజన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం ఎంపీలుపార్లమెంటు తరువాయి 2లో




# ఏపీకి హోదా కోసం 6న జాతీయ రహదారులపై పాదయాత్రలు

కేంద్రం ద్రోహం చేస్తుంటే టీడీపీ, వైకాపాలు నిందించుకుంటున్నాయి

సభను పదేపదే వాయిదా వేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

కార్యాచరణ ప్రకటించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చుకొనేందుకు భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై బుధవారం రాజధాని అమరావతిలో జరిగిన సీపీఎం, సీపీఐ, జనసేన నేతల భేటీలో చర్చించారు. ఈ భేటీ ముగిసిన అనంతరం సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో తొలుత జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 6న జాతీయ రహదారులపై పాదయాత్ర చేయాలని నిర్ణయించాం. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో ఇప్పటివరకు కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన, చేస్తోన్న నమ్మక ద్రోహానికి నిరసనగా ఉదయం 10గంటల నుంచి వూరూరా పాదయాత్రలు చేపట్టాలని జనసేన, సీపీఎం, సీపీఐ నిర్ణయించాయి. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ముందుకెళ్లకుండా జరుగుతున్న కుట్రను ఏపీ ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రగా మేం భావిస్తున్నాం. సభ సజావుగా నడపాల్సిన బాధ్యతను భాజపా ప్రభుత్వం విస్మరించడం, ప్రజాస్వామ్యానికి దారుణ దెబ్బగా భావిస్తున్నాం. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను నిరసిస్తూ 6న పాదయాత్రలు చేపడతాం. ప్రధానంగా జాతీయ రహదారులపైనే ఈ పాదయాత్ర జరుగుతుంది. జాతీయ రహదారులు లేని ప్రాంతాల్లో అక్కడి ముఖ్య కూడలిలో పాదయాత్రలు నిర్వహిస్తాం. పూర్తి శాంతియుత పద్ధతిలో జరిగే మా నిరసన తరువాయి 2లో

# ప్రత్యేక హోదా కోరుతూ బైక్ ర్యాలీ




కొయ్యూరు : ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇవ్వాలని మండల కేంద్రంలో యువకులు అల్లూరి యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ చదువులు పూర్తి చేసి రోడ్డున పడ్డామని, ప్రత్యేక హోదా ఇవ్వడం వలన తమకు న్యాయం జరుగుతుందని, ప్రత్యేక హోదా ఇవ్వకుంటే రాష్ట్రం అనేక ఆర్థిక సమస్యలకు గురి అవుతుందని, దీంతో రాష్ట్రం అదోగతికి చెందుతుందన్నారు. అన్యాయంగా తెలుగురాష్ట్రాలను విడదీసి చట్టబద్దత కల్పించడంలో మోదీ ప్రభుత్వం కావాలని తప్పించుకుంటుందన్నారు. రాష్ట్రానికి త్రప్యేక హోదా కల్పించేంత వరకు యువత ఉద్యమం ఆపదని, ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరవాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యూత్ యువకులు, గిరిజన సంఘం, సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులు సూరిబాబు, వై.అప్పలనాయుడు, బడుగు రమేష్, గోకిరి చిన్నారావు, ప్రసాద్, సురేష్, శ్రీనుతో పాటు భోజన విశ్రాంతి సమయంలో స్థానిక ఎంపిడిఒ ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి త్వరలో డ్రోన్ కెమెరాలు మంజూరుకు చర్యలు

నర్సీపట్నం : మున్సిపాలిటీలకు డ్రోన్ కెమెరాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ సురేంద్ర తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ సరిహద్దులు, అక్రమ నిర్మాణాలు, భవన నిర్మాణాలు, పారిశుద్య పనులు పరిశీలించడానికి డ్రోన్ కెమెరాలు తీసిన చిత్రాలను ఉపయోగిస్తారని తెలిపారు. ఆధునిక పరిజ్ఞానంతో ఉపయోగించడంతో పరిపాలన మరింత సులభతరమౌతుందన్నారు. పెద్ద మున్సిపాలిటీలకు రెండు, కార్పొరేషన్‌లకు మూడు లేదా నాలుగు చొప్పున డ్రోన్ కెమెరాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆర్‌ఎస్ఐ సాఫ్టిక్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 110 మున్సిపాలిటీలకు ప్రభుత్వం 200 కెమెరాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని టెండర్ల ప్రక్రియలో ఉందని తెలిపారు.

### సోలార్ ఎనర్జీ వినియోగంలో

# రాష్ట్రంలోనే కలెక్టరేట్ ఫస్ట్

### సోలార్ విద్యుత్ ద్వారా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహణ



విజయనగరం : సోలార్ ఎనర్జీ ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను వ ఇనియోగించుకొని విజయ నగరం కలెక్టర్ కార్యాలయం, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో 160 కెడబ్ల్యుపి సోలార్ రూఫ్‌టాప్ మూడు దశల్లో ఏర్పాటు చేసి 1లక్షా56 వేల నుండి 1,71,600 వందల యూనిట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతీనెల జిల్లా కలెక్టర్ కార్యాలయం 18,900 యూనిట్ల విద్యుత్ శక్తి వాడకం జరిగి సుమారు రూ.3 లక్షలు విద్యుత్ బిల్లు చెల్లించేవారమని, 160 కెడబ్ల్యుపి సోలార్ పేనల్స్ ఏర్పాటు చేసిన తరువాత 19,200 యూనిట్లు ఉత్పత్తి అవుతుందని దీని ద్వారా భవిష్యత్‌లో ప్రతీనెల రూ.3 లక్షలు సోలార్ ఎనర్జీ వలన ఆదాయం అవుతుందని, విద్యుత్ బిల్లు చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. సోలార్ ఎనర్జీ ఏర్పాటుకు రూ.93,25,724లు ఖర్చు కాగా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా రూ.16.90 లక్షలు వచ్చిందని మిగిలినది సుమారు 6 సంవత్సరాల్లో పూర్తిగా సోలార్ ఎనర్జీ. వెనక్కివచ్చునని సోలార్ పేనల్స్ శాశ్వతంగా వుండి విద్యుత్‌శక్తి పూర్తి వాడకం నిరోదించి పర్యావరణ హితమైన సహజ హరిత ఇందన వనరులపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయం మొట్టమొదటిగా నిలవనున్నదని ఆయన తెలిపారు. సోలార్ ఎనర్జీ వాడకం ద్వారా సాలీన 110 ఎంటన్స్ హరిత గృహ వాయువులు విడుదల పూర్తిగా నివారించడమైందని కలెక్టర్ తెలిపారు.

# నేడు స్టీల్‌మార్చ్‌కు సిపిఎం మద్దతు

విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దని, ప్లాంట్‌కి స్వంత గనులు కేటాయించాలనే డిమాండ్‌తో విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేపట్టిన స్టీల్‌మార్చ్‌కు సిపిఐ (ఎం) గ్రేటర్‌విశాఖ నగర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు సిపిఐ(ఎం) గ్రేటర్ విశాఖ నగర కమిటీ సెక్రటరీ గంగారావు తెలిపారు. కూర్మన్నపాలెం నుండి కలెక్టరేట్ వరకు వేలాది మంది స్టీల్ కార్మికులు చేపట్టిన ఈ మార్చ్ దేశభక్తి యుతమైనది. ఈ మార్చ్ విశాఖలోని ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ ఉద్యమాలు మరింత ఉధృతం కావడానికి ఊపునిస్తున్నదన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఇది ఒక అపూర్వమైన ఘటనగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. విశాఖ కార్మికవర్గం, ప్రజలు కూడా పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని సిపిఐ (ఎం) కోరుచున్నట్లు వారు ఆ ప్రకటనలో కోరారు.

### నవజీవన్ ఆశ్రమంనకు

## రైస్, వస్తు సామాగ్రి వితరణ

భీమునిపట్నం : స్థానిక కృష్ణాకోలని లో ఉన్న నవజీవన్ సేవా ఆశ్రమం కు రైస్, స్టీలు కంచాలు, గ్లాసులు, తగరపువలస కు చెందిన డి.సి.ఆర్ జనరల్ స్టోర్ వ్యాపారి దుర్గా వాయునందన గుప్త పుట్టిన రోజు సందర్భంగా అతని కుటుంబ సభ్యులతో ఆశ్రమం కు వచ్చి ఆశ్రమ నిర్వాహుకులు శ్రీ స్వాతి, పాత్రుడలకు అందజేసారు.ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ అనాథ పిల్లలకు ఉపయోగ పడే విధంగా వస్తు సామాగ్రి అందజేసినందుకు అనందంగా ఉన్నాదని ఆయన అన్నారు.

## అగ్నిమాపక వాలంటీర్ నియామకానికి ధరఖాస్తులు ఆహ్వానం

భీమునిపట్నం : చిట్టివలస అగ్నిమాపక కేంద్రంలో అగ్ని మాపక వాలంటీర్ నియామకానికి ధరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు అగ్నిమాపక అధికారి షేక్ మదీనా తెలిపారు. భీముని పట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో నివాసం ఉంటున్న ఆసక్తి గల యువకులు తమ బయోడేటాను చిట్టివలస అగ్నిమాపక కార్యాలయానికి అందించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9963728726,9491852101 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు కనుక్కోవాలని అన్నారు.

### ఉత్తమ పాఠశాలలో

## సాంఘీక సంక్షేమ శాఖలో నమోదు

విజయనగరం : ప్రభుత్వ గుర్తింపుపొందిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాలతో నడపబడుతున్న పాఠశాలలను సాంఘీకసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఉత్తమపాఠశాలలుగా నమోదు చేసుకునేం దుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా కలక్టర్ వివేక్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘీక సంక్షేమ శాక సంచాలకుల ఆదేశం మేరకు ఎస్సీ విద్యార్థులను ఎంపిక కాబడిన ఆ ఉత్తమ పాఠశాలలో చేర్పించి విద్యను అందిస్తామని తెలిపారు. విశాలమైన తరగతి గదులు, క్రీడాప్రాంగణం, ప్రయోగశాల, కంప్యూటర్, గ్రంథాలయం కలిగి ఉన్న బెస్ట్ ఎవేలబుల్‌గా గుర్తింపుపొందిన పాఠశాలల యాజమాన్యం ఈ నెల 8వ తేదీలోగా సాంఘీక సంక్షేమ శాఖ సంచాలకులకు దరఖాస్తులు పంపించాలని తెలిపారు. ఇతర వివరాలకు 08922-273676 నెంబరును కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

## విద్యతో..సాంకేతికత కూడా పెరగాలి

### మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ బి.ఆర్.కెరాజు

విజయనగరం: విద్యతోపాటు సమాంతర సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ బి.ఆర్.కెరాజు పిలుపునిచ్చారు. స్థానిక ఫూల్‌బాగ్‌లోని పి.జి.కళాశాల వార్షికోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వారు ఎంచుకున్న రంగాల్లో లేదా వృత్తులలో నైపుణ్యత పెంచెకునేందుకు కృషిచేయాలని కోరారు.

# రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది

## మోర్ సంస్థని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్

విజయనగరం : రైతులు పండించిన పంటలకు మంచి ధర లభించి అభివృద్ధి చెందేందుకు కూరగాయల కొనుగోలు కేంద్రం ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ అన్నారు. బుధవారం రామభద్రపురం మండలం అరికితోట గ్రామంలో మోర్ సంస్థ కూరగాయల ఉత్పత్తిదారుల సహకార సంఘం సహాయంతో ఏర్పాటు చేసిన కూరగాయల కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన పంటకు మంచి ధర లభించి రైతులకు 20 శాతం ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. రైతు ఆదాయం పెరిగితే వారు అభివృద్ధి చెందేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. రైతులు వినియోగదారులకు అవసరమైన నాణ్యమైన కూరగాయలను ఉత్పత్తి చేసి మంచి ధర పొందాలని ఆయన సూచించారు. ఈ కూరగాయలు చాలా నాణ్యమైనవిగా వున్నాయన్నారు. కూరగాయలు నాణ్యమైనవిగా పండించేందుకు ఉద్యానవన శాఖ అందించే శిక్షణను సమగ్ర సస్యరక్షణ సబ్సిడీ విత్తనాలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో అరికితోట కూరగాయలు ఉత్పత్తిలో ముందంజలో వుందని, గ్రామంలో స ఉమారు 200 మంది రైతులు రబీ, ఖరీఫ్‌లో కూరగాయలు పండిస్తున్నారని, రామభద్రపురం మండలంలో 1800 మంది రైతులను గుర్తించి 133 రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటు చేసి వీరికి బ్యాంకు అకౌంట్లను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పండించిన కూరగాయలను రవాణా చేసేటప్పుడు కొంత నష్టం జరుగుతుందని, అటువంటి నష్టాన్ని నివారించేందుకు ఆరికితోట గ్రామంలో మోర్



సంస్థ వారు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం రైతులకు మేలు జరుగుతుందన్నారు. కూరగాయల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కూరగాయలు అమ్మిన రైతులకు నేరుగా వారి బ్యాంకు అకౌంట్లకు జమచేసే విధంగా మోర్ సంస్థ చర్యలు చేపడుతుందని, ప్రస్తుతం నగదు చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతు ఉత్పిత్తిదారులకు అన్ని శాఖల సహకారంతో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్, ఎన్‌టిఆర్ జలసిరి, కమ్యూనిటీ బోరు బావులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మామిడి పండ్లను కూడా మోర్ సంస్థ కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిందని వాటిద్వారా కూడా రైతులు మంచి లాభాలు పొందాలని ఆయన సూచించారు.

రైపెనింగ్ ఛాంబర్‌లు అందుబాటులోనికి వచ్చాయని వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. వెలుగు పి.డి. కె.సుబ్బారావు మాట్లాడుతూ వెలుగు సంస్థ ద్వారా రైతు ఉత్పత్తి దారుల సంఘాలను బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా వచ్చే పథకాలు వీరికి చేరేవిధంగా కృషి చేస్తామని తెలిపారు. మోర్ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైజాగ్‌లో జ్ఞానాపురం మార్కెట్ ఏవిధంగా వుంటే అదేవిధంగా ధర నిర్ణయించడం జరుగుతుందని, ట్రాన్స్‌పోర్టు, లోడింగ్, అన్‌లోడింగ్, ఛార్జీలు, కమిషన్ నిమిత్తం రూ.2లు తగ్గించి రైతులకు ధర ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులకు మోర్ సంస్థ ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయడం జరుగుతుందని, గ్రేడింగ్ చేసి కూరగాయలు కొనుగోలు చేసి మంచి ధర ఇస్తామని తెలిపారు. కూరగాయలు పండించే విధానంపై మెలుకవలతో కూడిన శిక్షణ ఇస్తామని ఆయన అన్నారు.

ఉద్యానవన శాఖ డిడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు వారికి శిక్షణ కూడా అందిస్తామని తెలిపారు.

**టైటిల్ డీడ్ పడిపోయినది**

నాకు ఆత్రేయపురం మండలం, మెర్లపాలెం గ్రామంలో సర్వే నెం.150-4, 150-5 ర్లులో య 0-70 ట్లు వ్యవసాయం భూమి కలదు. సదరు భూమికి మంజూరు కాబడిన 233991 (పట్టా నెం.301) నెంబరు గల టైటిల్ డీడ్ మెర్లపాలెంలో జిరాక్సు తీయించుటకు వెళ్ళుచున్న సమయంలో ఎక్కడో పడిపోయినది. దొరికినవారు దయచేసి ఈ క్రింది అడ్రసుకు తెలియపరచగలరు.

జంపన నాగరాజు, తండ్రి: సత్తిరాజు, మెర్లపాలెం, ఆత్రేయపురం మండలం. సెల్ నెం. 99125 86977.

మొదటి పేజీ తరువాయి

## వివక్ష ఎందుకు?

పరిస్థితి వివరించా. సాయం కోసం నాలుగేళ్లుగా ఎదురుచూశాం. కానీ, ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చలేదు అని చంద్రబాబు అన్నారు.

ప్రత్యేక హోదాకు సమానంగా ప్యాకేజీ ఇస్తామంటేనే నాడు అంగీకారం తెలిపామని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో హోదా ఇవ్వలేం అన్నారు. 14వ ఆర్థిక సంఘం వద్దని చెప్పిందన్నారు. కానీ, కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికీ అమలు చేస్తున్నారు. ఏపీకి ఎందుకు ఇవ్వరు? అని చంద్రబాబు ప్రశ్నించారు.

కేంద్రం తీరుతో ఏపీ ప్రజలు విసుగెత్తిపోయారని చంద్రబాబు అన్నారు. ఏపీకి జరిగిన అన్యాయాన్ని దేశ ప్రజలకు వివరించేందుకే తాను ఢిల్లీకి వచ్చానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ గడ్డపై ఆ ప్రాంత ప్రజలకు నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను వీడియో క్లిప్పింగులు వేసి చూపించారు. 2014 ఎన్నికల సందర్భంగా నెల్లూరు బహిరంగ సభలో, అమరావతి శంకుస్థాపన సందర్భంగా, తిరుపతి సభలో ఏపీ ప్రజలకు మోదీ ఇచ్చిన హామీలను గుర్తు చేసి కేంద్రం తీరును ఎండగట్టారు.

'మాది కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. అప్పుడే పుట్టిన శిశువుతో సమానం. కేంద్రం నుంచి అందాల్సిన సాయం అందకపోతే రాష్ట్ర మనుగడ కష్టం. కేంద్రం ప్రభుత్వం ఒక రాష్ట్రంపై వివక్ష చూపడం తగదు. ప్రాంతీయ పార్టీలన్ని ఈ విషయాన్ని గమనిస్తున్నాయి. మాకు మద్దతు తెలుపుతున్న నేతలందరికీ ధన్యవాదాలు అని చంద్రబాబు అన్నారు.

## స్వార్థం కోసమే బాబు దిల్లీ పర్యటన

మాత్రమే పరిహారం ఇచ్చారని విమర్శించారు.

వైఎస్ జగన్‌తో ప్రత్యేక హోదా సాధన సమితి నేతల భేటీ

ఏపీ ప్రతిపక్ష నాయకుడు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో ప్రత్యేక హోదా సాధన సమితి నేతలు బుధవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో ప్రత్యేక హోదా సాధనసమితి నేతలు చలసాని శ్రీనివాసరావు, తాడి నరేష్, కొండా నర్సింగరావు, సదాశివరెడ్డి, అప్పలనాయుడు, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

హోదాపై ఇప్పటికే కార్యాచరణ ప్రకటించామని, త్వరలో మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చిద్దామని హోదా సాధన సమితి నేతలతో ఈ సందర్భంగా వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబు కేంద్రాన్ని గట్టిగా అడగకపోవడం వల్లే హోదా రాలేదని, ఒక వేళ చంద్రబాబు అడిగి ఉంటే హోదా వచ్చి ఉండేదని చెప్పారు. ప్రత్యేక హోదాకు కేబినేట్ ఎప్పుడో ఆమోదం తెలిపిందని.. ప్లానింగ్ కమిషన్‌ను చంద్రబాబు కలిస్తే హోదా వచ్చేదని, కాలయాపన చేసి ప్రస్తుతం డ్రామాలాడుతున్నాడని వారికి వివరించారు. చంద్రబాబు ఢిల్లీకి వెళ్లింది హోదా కోసం కాదు, ప్రజలను మరోసారి మభ్యపెట్టడానికేనని అన్నారు. హోదా కోసం పోరాడే వారందరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసాయిచ్చారు. అలాగే హోదా ఉద్యమకారులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక హోదా అంశం విషయంలో మొదటి నుంచి వైఎస్ జగన్ ఒకే మాటపై నిలబడి, ఈ అంశాన్ని సజీవంగా ఉంచారని ప్రత్యేక హోదా సాధన సమితి నేతలు ప్రశంసించారు. అన్ని రాజకీయ పక్షాలు, సంఘాలను కలుపుకుని.. ప్రత్యేక హోదా పోరాటానికి నాయకత్వం వహించాలని ఈ సందర్భంగా కోరారు. ఢిల్లీ వెళ్లి ఆమరణ దీక్షలో పాల్గొనే ఎంపీలకు తాము సంఘీభావం తెలుపుతామని వైఎస్ జగన్‌కు ప్రత్యేక హోదా సాధన సమితి నేతలు తెలిపారు.

## కొనసాగుతున్న సభలు

దురదృష్టవశాత్తూ చర్చలు జరగడం లేదు. ఇది దేశ ప్రజల దురదృష్టం. చర్చలకు ఛైర్మన్, ప్రభుత్వం అంగీకరించినప్పటికీ చర్చలు జరగడం లేదు. అసలేం జరుగుతుందో నాకు అర్థం కావడం లేదు. ఇది ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. ప్రజాస్వామ్యాన్ని ఇది ఖూనీ చేసినట్లే. పరిస్థితిపై దేశ ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు అని వెంకయ్యనాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సమావేశాలు ప్రారంభం కాగానే ఓవైపు ఎస్సీ, ఎస్టీ చట్ట సవరణలపై కాంగ్రెస్, బీఎస్పీ నేతలు ఆందోళన చేస్తుండగా.. మరోవైపు కావేరీ మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాల్సిందిగా అన్నాడీఎంకే నేతలు.. ఇంకోవైపు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ ఎంపీలు ప్లకార్డులు పట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది.

ప్రారంభం.. వాయిదా.. మారని లోక్‌సభ తీరు

లోక్‌సభలో తీరు మారడం లేదు. రోజూ మాదిరిగానే బుధవారం కూడా అన్నాడీఎంకే సభ్యుల ఆందోళనతో లోక్‌సభ ప్రారంభమైన అర నిమిషానికే వాయిదా పడింది. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి ప్రారంభమైనా సభా కార్యకలాపాలు సజావుగా సాగలేదు. సభ్యుల ఆందోళనల మధ్యే స్పీకర్ సుమిత్రా మహాజన్ కాసేపు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అనంతరం తెదేపా, వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను సభలో చదివారు. సభ్యులు ఆందోళన విరమించి అవిశ్వాసంపై చర్చకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో చర్చకు అనుమతి ఇవ్వలేమంటూ సభను గురువారానికి వాయిదా వేశారు.

## ఆర్టీసీ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు

ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అందుకే ఉద్యోగులకు ఇబ్బందిగా ఉన్న సర్క్యులర్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు వివరించారు. అమరావతి పేరుతో ఆర్టీసీ ప్రారంభించిన బస్సులకు మంచి ఆదరణ లభిస్తోందని... ప్రతి జిల్లా కేంద్రం నుంచి ఇలాంటి బస్సులను తిప్పే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి చెప్పారు. ప్రస్తుత బస్సులను ఒక్కోటి రూ.కోటి 20లక్షలతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత మూడేళ్లలో డీజిల్ ధరలు లీటర్‌కు 15 రూపాయలకు పైగా పెరిగిన నేపథ్యంలో ఆర్టీసి ఛార్జీలు పెంచాలన్న ప్రతిపాదనలు ఉన్నాయా అన్న ప్రశ్నకు.... అలాంటి ఆలోచన ఏమీ లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణికులకు సేవలందించే పల్లె వెలుగు బస్సులకు డీజిల్‌పై వ్యాట్ మినహాయింపు విషయం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు, అధికారులు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

## తెదేపా ఎంపీల ఆందోళన

ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. పార్లమెంటు ఉభయసభలు ప్రారంభానికి ముందు గాంధీ విగ్రహం ఎదుట ప్లకార్డులు చేతబూని ఆందోళనలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఏపీ పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు ఎంపీ శివప్రసాద్ దోబీ వేషధారణలో ఆందోళనలో పాల్గొన్నారు.

## ఏపీకి హోదా కోసం 6న జాతీయ రహదారులపై పాదయాత్రలు

దిల్లీని తాకేలా ఉంటుంది. సీపీఎం, సీపీఐ, జనసేన నాయకులే కాకుండా స్థానిక కార్యకర్తలూ పాదయాత్రల్లో పాల్గొంటారు. కేంద్రం ద్రోహం చేస్తుంటే తెదేపా, వైకాపాలు కేంద్రంపై ఒత్తిడి తేకుండా పరస్పరం నిందించుకుంటూ రాష్ట్ర ప్రజలకు చేటు కల్గించేలా వ్యవహరిస్తున్నాయి. అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా సభను పదేపదే వాయిదా వేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. తెలుగు ప్రజలకు ద్రోహం చేయడమే. ఈ నెల 6న పాదయాత్ర, ఆ తర్వాత అనంతపురం, విజయనగరం, ప్రకాశం జిల్లా ఒంగోలులో కూడా మేధావులతో చర్చలు, సభలు కూడా నిర్వహిస్తాం. అలాగే, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేయడాన్ని మేం తీవ్రంగా పరిగణిస్తున్నాం. 11 మంది చనిపోవడం, 400 మంది గాయపడటం చాలా బాధను కల్గించింది. ఒక చట్టాన్ని సుప్రీంకోర్టులో కాకుండా దీనిపై పార్లమెంట్‌లో చర్చను చేపట్టి ముందుకు తీసుకెళ్తే బాగుండేది. 6న జరిగిన పాదయాత్రలో అమరావతిలో నేనూ పాల్గొంటున్నా. ఏ జిల్లా నేతలు ఆ జిల్లాలోనే పాల్గొంటారు అని పవన్ వివరించారు.

**కేంద్రం నమ్మకద్రోహం చేసింది**

**పవన్ డిమాండ్ వల్లే..: రామకృష్ణ**

ప్రత్యేక హోదా, విభజన హమీల సాధన కోసం కేంద్రంపై అవిశ్వాసం పెట్టాలని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారని, అందువల్లే తెదేపా, వైకాపా అవిశ్వాస నోటీసులు ఇచ్చాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అయినప్పటికీ, అవిశ్వాసంపై చర్చించేందుకు కేంద్రం ముందుకు రావడంలేదన్నారు. తెదేపా, వైకాపా నేతలు ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటున్నారని విమర్శించారు. 5 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు పక్కనపెట్టేలా తెదేపా, వైకాపాలు వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన నమ్మక ద్రోహనికి వ్యతిరేకంగా ఈ నెల 6న పాదయాత్రలు చేస్తామని అన్నారు.

**చట్టాలను భాజపా నీరుగారస్తోంది**

**రాజధానిలో రోడ్లపైకి వస్తున్నాం..: మధు**

ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టబోతున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు అన్నారు. విజయవాడ రహదారులపైకి తాము రాబోతున్నామని, కేంద్రం స్పందించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని భాజపా నీరుగారుస్తోందని మండిపడ్డారు. ఉద్యమ ప్రణాళికలను దశలవారీగా ప్రకటిస్తామని మధు అన్నారు.

# ఏయూ ఆర్‌సెట్ ప్రవేశాలు ప్రారంభం

రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు



ఆంధ్రవిశ్వవిద్యాలయంః ఏయూలో ఎంఫిఎల్, పిహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం ఉదయం ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన ఆర్‌సెట్ ప్రవేశాలను రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు ప్రారంభించారు. విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందించి అభినందించారు. ఈ నెల 7వ తేదీ వరకు ప్రవేశాలు జరుపుతారు. కార్యక్రమంలో ప్రవేశాల కార్యాలయం సంచాలకులు ఆచార్య కె.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు వైజాగ్ స్టీల్ మార్చ్

## కూర్మన్నపాలెం నుండి జివిఎంసి వరకు పాదయాత్రను జయప్రదం చెయ్యండి

విశాఖపట్నంః కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు స్వంత గనులు ఇవ్వాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించరాదని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయొద్దని, గనులు కేటాయించాలని మన రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ వైజాగ్ స్టీల్ మార్చ్ జరుపతలపెట్టినట్లు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాదయాత్ర వైజాగ్ స్టీల్ స్థూపం (కూర్మన్నపాలెం) ఉ॥ 5గం॥లకు ప్రారంభమై జివిఎంసి సెంట్రల్ పార్కు వరకు 24 కిలోమీటర్లు జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ విలువను తగ్గించి ఎంత పెట్టుబడి అయితే పెట్టిందో అదే పెట్టుబడి 4,890కోట్ల రూ॥లకు అమ్మకానికి పెట్టింది.ఈ చర్యలను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, ఆఫీసర్లు, కాంట్రాక్టు కార్మికులు స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికోసం లాభాల బాటలో నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఇటువంటి బంగారుబాతు లాంటి స్టీల్‌ప్లాంట్‌కి గనులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నష్టాల్లోకి నెడుతున్నది. మరోప్రక్క అమ్మకానికి సిద్ధమౌతున్నది.

దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఉవ్వెత్తున ఎగిసి పోరుబాట పట్టాలని వారు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశాఖ ప్రజానీకమంతా తమ యొక్క సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరుతున్నామన్నారు.

# 12 ,13 ,14 తేదీల్లో భారీగా అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి లొ ఏప్రిల్ 12 ,13 ,14 తేదీల్లో భారతరత్న బాబా సాహేబు డా. బి.అర్. అంబేద్కర్ 127వ జయంతి మహోత్సవాలు భారీగా నిర్వహిస్తున్నట్లు స్థానిక అంబేద్కర్ యూత్ సభ్యులు తెలిపారు .అంబేద్కర్ కాలనిలో బుధవారం కరపత్రాన్ని విడుదల చేశారు ,ఈ సందర్భంగా కేవీపీస్ జిల్లా నాయకులు కాటపల్లి అప్పారావు మాట్లడుతూ ఈ నెల 12 న విద్యార్థిని ,విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాచ రచన, 13 న మహిళలకు ముగ్గులు జరుగుతాయన్నారు .14 న ఉదయం 9 గంటలకు కోలనీలో అంబేద్కర్ విగ్రహం ,నీలి జెండా ఆవిష్కరణ .10 గంటలకు గ్రామ పురవీధులో భారీ ఉరేగింపు జరుగుతుంది .అనంతరం నాలుగు రొడ్ల కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల అలంకరణ ,సభా కార్యక్రమం జరుగుతుంది .మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ ,సాయంత్రము దళిత ప్రజా ప్రతినిధులకు సన్మానం ,తరువాత బహుజన సైరన్ ఉదయ్ భాస్కర్ సంస్కృతిక కార్యక్రమం తో పాటు రేలారే రేలా కార్యక్రమం జరుగు తుందని ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయలని కోరారు .ఈ కార్యక్రమంలో సబ్బవరపు రాజు బాబు ,ఉల్లి శ్రీను ,చింతాలు ,కాటపల్లి సన్యాశిరావు ,సబ్బవరపు మాలి బాబు ,కె .శ్రీను .కొండలరాజు ,కొండల రావు ,కె .అప్పారావు ,నాగభూషణం తదితరులు పాల్గోన్నారు .

# ఏప్రిల్ 30 లోగా ఆస్తిపన్ను చెల్లించండి

- 5 శాతం రాయితీ పొందండి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం: జివియంసి పరిధిలోని ఆస్తిపన్ను దారులు ఏప్రిల్ 30వ తేదీలోగా ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని కమిషనర్ హరినరాయణన్ పేర్కొన్నారు. ఏప్రిల్ 4వతేది నుండి (బుధవారం) ఆస్తిపన్ను దారులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఆస్తిపన్నును వెంటనే మీకు దగ్గర లోని మీసేవకేంద్రం, జోనల్ కార్యాలయం, పురసేవ అప్లికేషన్ ద్వారా చెల్లించాలని కోరారు.

2017-18 ఆర్ధిక సంవత్సరంలో పన్నులు చెల్లించిన పన్నుదారులను కమిషనర్ అభినందించారు.


పన్నులు సకాలంలో చెల్లించాలని, నగర అభివృద్ధికి సహకరించాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ఐదవ తరగతి పరీక్షను వాయిదా వేయాలి

## ఏపీ చైల్డ్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీతారాం

విశాఖపట్నంః ఈ నెల 21వ తేదీన రాష్ట్ర విద్యా శాఖ సమాయత్తమవుతోంది. ఆరో తరగతి ప్రవేశానికి గాను ఈ నెల 21వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహణకు నవోదయ విద్యాలయ సంస్థ సిద్ధమవుతోంది. ఈ పరీక్షకు లక్షలాది మంది విద్యార్థులు రాయడానికి సిద్ధమౌతున్న నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అయోమయానికి గురికావలసిన పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సీతారాం మాట్లాడుతూ ఈ పరీక్షల నిర్వహణ బాలల బంగారు భవిష్యత్తును నిర్ణయించుకునే విధానంపై విఘాతమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వాయిదా వేయలేరు కావున రాష్ట్ర ప్రభుత్వమే విద్యా శాఖ నిర్ణయాన్ని వాయిదా వేయాలని, తద్వారా బాలలకు నవోదయ పరీక్షలకు హాజరయ్యే అవకాశాన్ని కల్పించవలసిందిగా కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యా శాఖ మంత్రుల దృష్టికి కూడా తీసుకువెళ్లనున్నట్లు ఏపీ చైల్డ్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీతారాం అన్నారు.

# ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ ఎం.పి.ల బాటలలో వినూత్న నిరసన




ఆంధ్రా యూనివర్శిటీః ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కోరుతూ వై.యస్.ఆర్. స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆంధ్రాయూనివర్శిటీ మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ఎం.పి.ల ఫోటోలను మెడలో వేసుకొని ఖాళీ కంచాలతో నిరసన తెలియజేయటం జరిగింది. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కోసం అఖిలపక్షంతో ఢిల్లీ వెళ్తున్నారని, ఢిల్లీలో జస్టిస్ చలమేశ్వరరావుని కలిస్తే ప్రత్యేక హోదా వస్తుంది అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా కోసం వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వై.యస్.ఆర్.సి.పి ఎం.పి.లు రాజీనామాలకు సిద్ధంగా ఉన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని తెలుగుదేశం, బిజెపికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ ఎం.పి.లందరు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా కేంద్రప్రభుత్వం అధిష్ఠానం దిగివచ్చి ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు. ప్రత్యేక హోదా రాకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువత భవిష్యత్‌లో ఉపాధిలేక భిక్షాటన చేయవలసి వస్తుందని, లేదంటే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్ యస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, రాష్ట్ర కార్యదర్శులు బి.మోహన్‌బాబు, టి.సురేష్‌కుమార్. బి.జోగారావు, విద్యార్థి నాయకులు పి.రాధాకృష్ణ, కె.సాయిక్రిష్ణ, సి.కాంతికిరణ్, బి.నికేష్, చాణిక్య, గణేష్, బాలాజీ, చినబాబు, నాగేంద్రనాయక్, ఆదర్శ్, కిశోర్, మహేంద్ర, ప్రేమ్‌ప్రసాద్, వంశీ, మల్లిఖార్జున మరియు పలు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒకటవ జోనల్ కమిషనర్ సత్యవేణికి అభినందన

విశాఖపట్నం: ఒకటవ జోన్ మధురవాడలో నాలుగు సంవత్సరాలు కమిషనర్‌గా పనిచేసి పదోన్నతిపై కాకినాడ అదనపు కమిషనర్‌గా వెళుతున్న సత్యవేణిని కమిషనర్ హరినారాయణన్ అభినందించారు. హుద్ హుద్ నుండి నేటివరకు ఎంతో అంకితభావంతో సేవలందించినందుకు అభినందిస్తూ మరింత అంకితభావంతో విధులు నిర్వర్తించాలని అభిలషించారు

# ప్రత్యేకహెూదా, విశాఖ రైల్వేజోన్‌కై నేడు బ్లాక్‌డేను జయప్రదం చేయండి

- రాత్రి విద్యుత్ లైట్లు ఆర్పి నిరసన తెలియజేయండి
- ప్రజలు, వ్యాపారవాణిజ్య సంస్థలు మద్దతు ఇవ్వండి
- జివిఎంసి సహకరించి వీధిలైట్లు ఆపాలి



విశాఖ సిటీః ఏపికి ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వే జోన్, విభజన చట్టంలోని హామీల అమలుకై వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు తలపెట్టిన బ్లాక్‌డేను జయప్రదం చేయాలని సిపిఐ (ఎం) గ్రేటర్‌విశాఖ నగర కమిటీ సెక్రటరీ డా. బి. గంగారావు విజ్ఞప్తి చేస్తున్నారు.. బుధవారం ఒక ప్రకటనలో ఆయన కోరుతూ ప్రజలు, వ్యాపారవాణిజ్య సంస్థలు నేటి సా॥ 7నుండి 7:30గం॥ల వరకు లైట్లను బంద్‌చేసి నిరసన వ్యక్తం చేయాలని కోరారు.. జివిఎంసి సిబ్బంది కూడ వీధిలైట్లు బంద్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరుచున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

# రూ.300 కోట్లు ఆస్తి పన్ను వసూలు లక్ష్యం

- ఆదాయవనరులను పెంపొందించుకొనేలా చూడండి
- ఏప్రిల్ 4 బుధవారం నుండి ఆస్తిపన్ను డిమాండ్ నోటీసులు పంపిణీ
- ప్రొఫెసన్ ట్యాక్సు (వృత్తిపన్ను) వసూలుకు ఎన్‌పోర్స్ విభాగం రూపకల్పన
- నీటిపన్ను, ఖాళీ స్థలాల పన్ను, ట్రేడ్ లైసెన్సుల వసూలుపై దృష్టి
- ఆదాయ ముంటేనే అభివృద్ధి, సంక్షేమం .. జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: జివియంసి 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను వసూలు లక్ష్యం రూ.300 కోట్లుగా కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో (మంగళవారం రాత్రి) నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ వసూలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదాయవనరులను పెంపొందించుకొనేలా ప్రతి ఒక్కరు చూడాలని కమిషనర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా లక్ష్య సాధనకు నెలవారీ కార్యాచరణ రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 4 వతేది బుధవారం నుండి ఆస్తిపన్ను డిమాండ్ నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది అండర్ అసెస్‌మెంట్, అన్‌అసెస్డ్ ఆస్తులను గుర్తించి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రొఫెషన్ ట్యాక్సు (వృత్తిపన్ను) జివియంసి వసూలు చేయవలసిఉన్నందున వసూలు కోసం, పర్యవేక్షణ కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని రూపొందించుకోవాలని కోరారు. బాధ్యతాయుతంగా పన్ను వసూలు చేసిన అధికారులు, ట్యాక్సు కలెక్టర్లకు, పన్నులు చెల్లించిన ప్రజలకు ఈ సందర్భంగా కమిషనర్ అభినందించారు. నిర్దేశించిన లక్ష్యం చేరని నలుగురు ట్యాక్సు కలెక్టర్లను కమిషనర్ బాధ్యతల నుండి తప్పించారు. నీటి పన్ను, ఖాళీస్థలాల పన్ను, ట్రేడ్ లైసెన్సులను సక్రమంగా వసూలుచేసి ఆదాయాన్ని సమకూర్చడం ద్వారా జివియంసి అభివృద్ధి, సంక్షేమానికి దోహదపడాలని కోరారు. ఆదాయం ఉంటేనే, అభివృద్ధి-సంక్షేమని భావించారు. అదనపు కమిషనర్లు జివివియస్ మూర్తి, సకలారెడ్డి, యస్.యస్.వర్మ, డిప్యూటి కమిషనర్ (రెవెన్యూ) ఆర్.సోమన్నారాయణ, అందరు ఏసిఆర్‌లు, ఆర్.ఓలు, జోనల్ కమిషనర్లు, ట్యాక్సు కలెక్టర్లు పాల్గొన్నారు.

# గీతం న్యాయ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

సాగర్‌నగర్ః న్యాయవాద వృత్తిలో ప్రవేశించాలనే వారికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ప్రధాన అర్హతగా గీతం స్కూల్ ఆఫ్ లా ఐదేళ్ల న్యాయ విద్యా కోర్సులలో ప్రవేశాలను కల్పిస్తోంది. ఆర్ట్స్ మరియు కామర్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసిన వారికి సహితం న్యాయ విద్యను అభ్యసించేందుకు అవకాశం లభిస్తోంది.

గీతం విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల స్కూల్ ఆఫ్ లా 2018-19 విద్యా సంవత్సరానికి న్యాయ విద్యా కోర్సులకు అడ్మిషన్లను నిర్వహిస్తోంది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) అనుమతితో నిర్వహిస్తున్న న్యాయ విద్యా కోర్సులలో ప్రవేశానికి వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు అధికంగా ఆసక్తి కనబరుస్తున్నారు.

గీతం స్కూల్ ఆఫ్ లా ద్వారా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బి.ఎ., ఎల్‌ఎల్‌బి (ఆనర్స్) కోర్సును, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తో కలసిన ఎల్‌ఎల్‌బి ఆనర్స్ కోర్సును, మూడేళ్ల ఎల్‌ఎల్‌బి కోర్సును, రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎమ్ (ఐపిఆర్ & ఎడిఆర్) కోర్సును నిర్వహిస్తున్నారు. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్-2018) లేదా లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ (ఎల్‌శాట్-2018) లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పై కోర్సులలో నేరుగా ప్రవేశాలు కల్పిస్తామని స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ వై.సత్యన్నారాయణ తెలిపారు.

***గీతం స్కూల్ ఆఫ్ లా ప్రత్యేకతలు:***

న్యాయ విద్యా కోర్సులలో ప్రత్యేక అంశంగా డ్రాఫ్టింగ్, ప్లీడింగ్, కన్వెన్సింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ లా గౌరవ ప్రొఫెసర్లుగా దేశంలోని ప్రముఖ న్యాయ కోవిదులు వ్యవహరిస్తున్నారని వారితో త్వరలో ప్రత్యేక న్యాయ అంశాలపై ప్రసంగాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. న్యాయ విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కోటి రూపాయలతో గ్రంధ సముదాయాన్ని ఏర్పాటు చేశామని అలాగే ప్రత్యేక మూట్ కోర్టు హాల్‌ను నిర్మించామని పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ రాష్ట్రాలకు చెందిన వంద మందికి పైగా విద్యార్థులు గీతం స్కూల్ ఆఫ్ లా లో న్యాయ విద్యను అభ్యసిస్తున్నారని డైరక్టర్ తెలిపారు.

గీతం స్కూల్ ఆఫ్ లా లో ప్రవేశం పొందగోరే వారు వివరాలకు గీతం వెబ్‌సైట్ www.gitam.edu ను పరిశీలించవచ్చునన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి సుకల రమణమ్మ

నర్సీపట్నం : బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను నర్సీపట్నం ఎంపిపి సుకల రమణమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హయాంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద వికలాంగులు, వితంతువులు, వృద్దులకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ, కేంద్ర సాయం లేకపోయినప్పటికీ పింఛన్లు అందజేయడం టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. ధర్మసాగరం గ్రామానికి సంబంధించి 20, దుగ్గాడ గ్రామానికి సంబంధించి 10 పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, పించన్‌దారులు పాల్గొన్నారు.

# నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే రాయితీ

యలమంచిలి రూరల్ : ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరులోగా ఇంటి పన్నులు చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా పన్ను చెల్లించనందుకు ఈ రాయితీ ఇస్తున్నామన్నారు. పన్నులు కట్టించుకోవడానికి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.

# ఐదు రోజులుగా పారిశుద్య కార్మికుల సమ్మె

రావికమతం : రావికమతం మండలం కొత్తకోట మేజర్ పంచాయతీలో నాలుగు రోజులుగా పారిశుద్య కార్మికులు సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లోని వీధులన్ని దుర్గంధం వెదజల్లుతున్నాయి. 14 మంది పారిశుద్య కార్మికులు ఉన్నారు. వారికి ఏడు నెలలుగా వేతన బకాయిలు ఇవ్వకపోవడంతో వారంతా ఏప్రిల్ 1 నుంచి ఆందోళన బాట పట్టారు.

దీంతో అపారిశుద్యం రాజ్యమేలుతుంది. కాలువలు నిండిపోయి కంపుకొడుతున్నాయి. రాజువీధి, శివాలయం, గుమ్మడువీధి, గాంధీనగరం, మెయిన్ స్కూల్ వద్ద మరీ అధ్వాన్నంగా ఉంది. దీనిపై తక్షణమే పాలక వర్గాలు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# రాజన్న పేట పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి

రోలుగుంట : శరభవరం పంచాయతీ శివారు రాజన్నపేట గిరిజన గ్రామాన్ని పంచాయతీల పునర్వ్యవస్థీకరణలో పంచాయతీలుగా ఎంపిక చేయాలని జెడ్పీటీసీ రామలక్ష్మి, ఈఒపిఆర్‌డి ఎస్.రామ్మోహనరావుకు గ్రామస్థులతో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఈఒపిఆర్‌డి రాజన్నపేటను పంచాయతీగా ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. శరభవరం పంచాయతీలో రాజన్నపేట, గదబపాలెం, గుర్రాలబయలు, అర్ల, లోసింగి, పీతురుగెడ్డ, ఆరు గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు.

# జీడిపిక్కల కొనుగోలుకు వెలుగు ఏర్పాట్లు

నాతవరం : రైతుల నుంచి జీడిపిక్కల కొనుగోలుకు వెలుగు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు ఓలం కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిదే. దీంతో పిక్కల తూకంలో మోసం లేకుండా ఉండేందుకు వెలుగు అధికారులు 20 ఎలక్ట్రానిక్ కాటాలను సిద్ధం చేశారు. కొనుగోళ్లకు కసరత్తు చేస్తున్నారు.

# తాగునీటి ఎద్దడి రానివ్వరాదు

## ఆర్‌అండ్‌బి మంత్రి సిహెచ్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలను చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులకు, ప్రజాప్రతినిధులకు మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో నియోజకవర్గంలో అమలు జరుగుతున్న అభివఅద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని గూర్చి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ గ్రామాలలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందో ముందుగా గుర్తించాలన్నారు. అవసరమైన మరమ్మత్తులను పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో గ అహనిర్మాణం, పంచాయతీ రాజ్ రోడ్లు వంతెనలు నిర్మాణాలు ఎంత వరకూ జరుగుతున్నది సమీక్షించారు. రూ.12 కోట్లతో చమ్మ చింత సరుగుడు రోడ్డు అభివ అద్ధి చేసేందుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో క్రైస్తవులకు సంబంధించిన ప్రార్థనా మందిరాలు ఫంక్షన్ హాల్స్ మొదలైనవి అసంపూర్తిగా ఉన్న వాటికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వాటి జాబితాను వెంటనే తయారు చేయాల్సిందిగా ఆదేశించారు. ఎస్సీ కాంపొనెంట్ ప్లాన్ లో కల్యాణ మండపాల నిర్మాణానికి ప్రభుత్వం రు.10 లక్షలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జన్మభూమి కమిటీలను, బూత్ కమిటీలను ప్రక్షాళన చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్ ఈ ఈ గోపీనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ రామమూర్తి, హౌసింగ్ డిఈ, జడ్పీటీసీ కరక సత్యన్నారాయణ, వేణుగోపాల్, ఎంపీపీలు సుకల రమణమ్మ, సన్యాసి దేవుడు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు అప్పలనాయుడు చింత కాయల విజయ్, లాలం శ్రీరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### పరిస్థితి తీవ్రతరం

ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దళిత సంఘాలు పిలుపునిచ్చిన మేరకు దేశవ్యాప్తంగా సాగిన బంద్ హింసాత్మకంగా మారి తొమ్మిది మంది మరణించడం విషాదకరం. ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ బంద్ సందర్భంగా తొమ్మిది మంది చనిపోగా, వందలాదిమంది గాయపడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా దళిత సంఘాలు ఇచ్చిన బంద్ హింసాత్మకంగా మారటం మన సామాజిక వైరుధ్యాలకు ప్రతిఫలంగా చెప్పుకోవచ్చు. ఇంత పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరుగటం, వివిధ రాష్ట్రాల్లో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడి కర్ఫ్యూ విధించే స్థితి రావటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. గతంలోనూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, ముఖ్యంగా వామపక్షాలు చేపట్టిన బంద్ సందర్భాల్లో కూడా ఇంతటి హింస, ప్రాణనష్టం జరుగకపోవటాన్ని యాదృచ్ఛికంగా తీసుకోవాల్సింది కాదు. తొలిసారిగా దళిత బహుజనులు తమ ఆత్మగౌరవ ప్రతీకగా పరిగణిస్తున్న ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పరిరక్షణ కోసం దేశవ్యాప్త బంద్ చేపట్టారు. ఈ బంద్ ప్రభావం ఉత్తరాదిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో తీవ్రంగా ఉండగా, దక్షిణాదిన నామమాత్రంగా కూడా లేకపోవటం గమనార్హం. దళిత సంక్షేమం దృష్ట్యా ఇప్పటి వరకు గడించిన అనుభవాల నుంచి ఇంకా పాఠాలు నేర్చుకోవలసి ఉందని ఈ బంద్ సూచిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టానికి ప్రస్తుతం సుప్రీంకోర్టు చేసిన తాజా సవరణలు, ఆ చట్టాన్ని నీరుగార్చే విధంగా ఉన్నాయని దళితవర్గా లు ఆవేదన చెందుతున్నాయి. గత కొన్నేండ్లుగా, ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి న తర్వాత దళితవర్గాలపై దాడులు ఎక్కువయ్యా యి. ఈ నేపథ్యంలోనే సుప్రీంతీర్పు రావటం పట్ల దళితుల్లో మరింత అభద్రత, ఆందోళన వ్యక్తం కావటానికి కారణమైంది. గోరక్షణ పేరిట ఉత్తరప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రా ల్లో దళితులపై దాడులు, హత్యలు చోటుచేసుకున్నా యి. అఖ్లాక్ ఉదంతం మొదలు ఇటీవల దళితుడు గుర్రంపై సవారీ చేశాడన్న కారణంతో హత్య చేసిన ఉదంతం దాకా ఎన్నో దాడులు జరిగాయి. ఇక పరువు హత్యలు, దళిత మహిళలపై జరుగుతున్న దాడులు నిత్యకృత్యమయ్యాయి. మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నవి కొన్ని అయితే, వెలుగు చూడనివి అంతకు ఐదురెట్లు ఉంటాయని సామాజిక, దళిత ఉద్యమకారులు అంటున్నారు. ఈ దాడులన్నీ బీజేపీ పాలిత, ప్రభావిత ప్రాంతాలే కావటం కాకతాళీయం కాదు. ఈ ప్రాంతాలలో ఇప్పటికీ భూస్వామ్య ఆధిపత్య విధానాల కొనసాగింపుగా కొనసాగుతున్న ఖాప్ పంచాయితీలు నడుస్తున్నాయి. దళితులపై సాంఘిక బహిష్కరణలు సాగుతున్నాయి. దళితవర్గాలపై జరుగుతున్న హింసాదౌర్జన్యాల నేపథ్యంలోనే ఉనా ఉద్యమం పురుడుపోసుకున్నది. ఇలాంటి సామాజిక వైరుధ్యాల నేపథ్యాలే ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్ర ఉద్రిక్తతలు, హింసకు పునాది. ఉత్తరాదితో పోలిస్తే ఏ రూపంలో చూసినా దక్షిణాదిన దళితులపై హింసా దౌర్జన్యాలు తక్కువేనని గణాంకాలన్నీ చెబుతున్నాయి. అందుకే దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళలో బంద్ హింసాత్మకంగా మారలేదు. ఇందుకు సామాజిక స్థితిగతులే కారణంగా చెప్పుకోకతప్పదు. దళితుల ఆత్మగౌరవ పోరాటానిది వేల సంవత్సరాల చరిత్ర అయితే, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టానిది ఏడు దశాబ్దాల చరిత్ర. తరతరాల వివక్ష, అణిచివేతల నుంచి ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన దళితవర్గాలకు రక్షణ కల్పించి, ఆత్మగౌరవాన్ని నిలిపేందు కోసం 1955లోనే పార్లమెంట్ అంటరానితనంపై, వారిపై దాడుల నిరోధక చట్టాన్ని చేసింది. 1976లో దీన్ని పౌరహక్కుల చట్టంగా పేరు మార్చినా అది దళితులకు అన్నివిధాలుగా రక్షణ కల్పించటం లో, ఆత్మగౌరవాన్ని నిలుపటంలో విఫలమైందని గ్రహించారు. ఈ క్రమంలొంచే 1989లో ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టానికి కూడా సామాజిక పరిస్థితులకు అనుగుణంగా మరింత పదునుపెడుతూ 2015లో మరికొన్ని సవరణలు చేశారు. అయినా రోజురోజుకూ దళిత వెనుకబడిన వర్గాలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఈ చట్టాన్ని మరింత నిర్వీర్యం చేసేదిగా ఉన్నాయని దళిత వర్గా లు భావిస్తున్నాయి. ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదైన వెంటనే అరె స్టు చేయాల్సిన అవసరం లేదని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఉద్యోగులైతే వారి అరెస్టుకు సంబంధిత ఉన్నతాధికారుల అనుమతి కావాలని అనటం విచారకరం.

భూదందా కేసులో

## మాజీ ఎంపీ అనుచరుల అరెస్టు

విశాఖపట్నం : మా కేంటి అడ్డు.. మాదే రాజ్యం.. మాకు ఎంపీ అండ ఉందంటూ రెచ్చి పోయ గంభీరం ప్రాంతంలోని యాతపేట భూమిలో ప్రవేశించి విధ్వంసం సృష్టించారు. బుధవారం ఉదయం సుమారు 20 మంది సదరు భూమిలోకి ప్రవేశించి అక్కడన్న సెక్యూరిటీ గార్డును యూనిఫారం తీయించి మరీ చితకబాదారు. అంతే కాకుండా అక్కడున్న సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేశారు.

విషయం తెలిసుకున్న భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు రంగ ప్రవేశం చేసి మాజీ ఎంపీ సబ్బంహరికి చెందిన వ్యక్తులుగా చెప్పుకుంటున్న వారిని అరెస్టు చేశారు.

వివరాలలోకి వెళితే..

గంభీరం గ్రామం ప్రాంతంలోగల యాతపేట, గంభీరంలోని కొంత భూమిని సిఎస్ఎన్ రాజు కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన పాస్ పుస్తకాలు కూడా పొంది అదే భూమిలో నివాసముంటున్నారు. అదే భూమిపై సబ్బంహరి కన్ను వేసినట్లు ఫిర్యాదుదారుడు రాజు పేర్కొన్నారు. ఈ భూ వ్యవహారంలో ఇద్దరి మధ్య చాలా కాలం నుంచి గొడవ జరుగుతోందని ఆయన చెప్పారు.

సబ్బం హరి అనుచరులు చేసిన దౌర్జన్యంపై భూయజమాని రాజు ఫిర్యాదు చేయగా పోలీసులు రంగప్రవేశం చేసి మాజీ ఎంపీ సబ్బం హరి అనుచరులను అరెస్టు చేశారు.

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను

## టిడిపి ప్రభుత్వం భోంచేస్తోంది..

పేరి శ్రావణ్ కుమార్



సింహాచలం : భారతీయ జనతా పార్టీ యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు పేరి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేవైఎం రాష్ట్ర మరియు జిల్లా నాయకుల సమావేశం సింహా చలంలో స్థానిక కళ్యాణమండపంలో జరిగింది. బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె యెన్ పి చక్రవర్తి టిడిపిపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన మాట్లడుతూ రాజధాని నిర్మాణానికి అన్ని వేల కోట్లు అవసరమా అంటూ డిజైన్లకు ఇప్పటిదాకా కాలయాపన చేసి డిజైన్ సెలెక్టింగ్లకు సినిమా డైరెక్టర్లను వెంటపెట్టుకొని వారి మంత్రుల బృందాలతో విదేశాలలో స్పెషల్ ఫ్లైట్లో వెళ్తూ అక్కడ విలాసాలు చేస్తూ ప్రజల సొమ్ము, నిధులు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఎంత హంగులు చేసినా ఎస్ ఎఫ్ టి కి 2 వేలు చాలా ఎక్కువ. అలాంటిది తాత్కాలిక సచివాలయానికి 11 వేలు చొప్పున లెక్క చూపుతున్నారని, దొంగలెక్కలతో ప్రజలని మోసంచేసి బీజేపిని ప్రజల ముందు దోషిగా చూపిస్తుందని ప్రత్యేక ప్యాకేజీకి సిద్ధం అని లెక్కలు అడిగితే చెప్పట్లేదన్నారు . మంత్రులు స్టాఫ్ క్వార్టర్స్ కట్టాం అంటూ బోలెడు ఖర్చు చూపిస్తున్నారుగాని ఎం ఎల్ సి మాధవ్ అమరావతి విజయవాడ అంత తిరిగినా క్వార్టర్స్ ఎక్కడా లేవన్నారు. టిడిపి నాయకులను అడిగితె కట్టాం అంటున్నారు గాని అవి ఎక్కడో చూపించట్లేదన్నారు .కేంద్ర ప్రభత్వం రాష్ట్రానికి అనేక విద్యాసంస్థలు నెలకొల్పిందని ఇంకా మిగతావి కూడా ఏర్పాటు చేస్తామన్నారు .రైల్వే జోన్ తప్పకుండ ఇస్తామని .అభివృద్ధి ఒకేచోట కాకున్న అభివృద్ధి వికేంద్రికరణ జరగాలన్నారు .2019 కేంద్రంలో బీజేపి ప్రభుత్వం వస్తుందని రాష్ట్రంలో బీజేపితో ఎవరువుంటారో వాళ్ళు గెలుస్తారు అన్నారు .బీజేవైఎం నగర ఉపాధ్యక్షుడు పేరి శ్రావణ్ కుమార్ మాట్లడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని సీఎం చంద్రబాబు దూషించడం తప్పని అది టిడిపి నాయకులు మానుకోవాలని కేంద్ర బీజేపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జిల్లా మండలాలు, గ్రామాలూ బీజేయం నాయకులు తిరుగుతూ ప్రజలకు వివరించి 2019లో బీజేపిని అధికారంలోకి తీసుకొస్తాము అని అన్నారు .బీజేపి వార్డు అధ్యక్షుడు బంటుమిల్లి మహేష్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను మోసంచేస్తు 4 సంవత్సరాలు గడిపేసారని .విశాఖకు సంబంధించి హుధుద్ లెక్కలు చెప్పకుండా కేంద్ర ప్రభుత్వం నిధులు యివ్వట్లేదనటం దారుణం అని ప్రతిపక్షంలో పంచగ్రామాల భూసమస్యగూర్చి ధర్నాలు, వాగ్దానాలు చేసి అదికారంలోకి వచ్చి భూసమస్య తీర్చకున్న 20 వేలమందికి శఠగోపం పెట్టారన్నారు. దేవస్థానం కూడా ఈ సమస్య వలన ఇబ్బందులు ఎదుర్కొంటోందని భూములు కాపాడడానికి అనేక డబ్బులు వెచ్చిస్తూ ఆర్థికంగా యిబ్బంది పడుతోందన్నారు. 3 నెలలు టైం టిడిపి కి ఇస్తున్నాం భూసమస్య తీర్చకపోతే ద్దీక్షలు చేపదతామన్నారు .దమ్ముంటే కార్పొరేషన్ ఎలక్షన్ పెట్టండి బీజేపి గెలిచి చూపిస్తుందని 2019 లో అధికారం బీజేపి ది అని, అదికారంలోకి రాగానే దేవస్థానం భూసమస్య తీరుస్తాం అన్నారు .ఈ కార్యక్రమంలో బీజేవైఎం కార్యవర్గ సభ్యులు పి సతీష్, బీజేవైఎం నగర కార్యదర్శి విజయ శంకరఫణీంద్ర, బీజేవైఎం నగర ప్రధాన కార్యదర్శి దొడ్డి శ్రీనివాస్ యితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఛైర్మన్ నాగేశ్వరరావును కలిసి రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు తమ సమస్యలను విన్నవించకుని వినతిపత్రం సమర్పించారు.. ఈ కార్యక్రమంలో సన్యాసిరావు, సుబ్బారావు, వెంకటరావు, రమేష్, గణపతి, కృష్ణ, నాగేశ్వరరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### మంచి మాట

మంచి మాట మహాత్ముల లక్షణం
మంచిగా మాట్లాడు, ప్రేమతో మాట్లాడు
సహృదయంతో, ఓదార్పునిస్తూ మాట్లాడు
చల్లని వెన్నెలలా
స్వాంతన కలిగించే మందులా
గిలిగింతలు పెట్టి తొలకరి జల్లులా
ప్రేమగా, ఆనందంగా
పరులకు సంతోషానిచ్చే విధంగా
మన పలుకులు వుండాలి
పదునైన ఆయుధంతో
తుట్లు పొడిచేలా వచ్చే మాటలు
వినాశ హేతువు, విధ్వంస కారకం

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : ఛైత్ర; తిథి : పంచమి రా.7.09; అనూరాధ ఉ.9.37; మ.వ.3.42ల 5.26.

గురువారం 05-04-2018

a **మేషం** : పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. విద్యార్థులకు ప్రింటింగ్ రంగాలవారికి సదా వకాశాలు లభిస్తాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలోచన అవసరం. బంధువులను కలుసుకుంటారు.

b **వృషభం**: కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లకు గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగస్తులు, ఒత్తిళ్ళు, ఆకర్షణలకు దూరంగా ఉండటం అన్నివిధాలా క్షేమదాయకం. మీ శ్రీమతి సూటిపోటి మాటలు అసహనం కలిగిస్తాయి. దైవ సేవా కార్యాక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. అనుకోకుండా నిరుద్యోగుల యత్నాలు ఒక కొలిక్కి రాగలవు.

c **మిధునం** :బ్యాంకు వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. వీలైనంతవరకు మీ పనులు మీరే చూసుకోవటం ఉత్తమం. ఆదాయాన్ని కన్నా ఖర్చులు అధికంగా ఉంటుంది. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునారాలోచన మంచిది. విద్యార్థినులకు ఒత్తిడి ఆందోళనలు ఎదుర్కొంటారు.

d **కర్కాటకం**:వ్యాపారవేత్తలు ప్రస్తుత పరిస్థితిని కొనసాగ నివ్వడం మంచిది. ప్రముఖులను కలుసుకుంటారు. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. ప్రింటింగ్ రంగాలవారికి సదవకాశాలు లభిస్తాయి. మీ సంతానం మొండివైఖరి మీకెంతో చికాకు కలిగిస్తుంది. హామీలు చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి.

e **సింహం** :విద్యార్థులు తోటి విద్యార్థులతో విందులు, వేడుకలలో పాల్గొంటారు. అవసరానికి సరిపడ ధనం సమకూరుట వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. మీ అవసరాలకు కావలసిన ధనం సమయానికి సర్దుబాటు అవుతుంది. ప్రైవేట్ ఫైనాన్సు సంస్థలో పొదుపు చేయటం మంచిది కాదని గమనించండి.

f **కన్య** : పెద్దల జోక్యంతో అనుకోకుండా ఒక సమస్య సానుకూలమవుతుంది. పంతాలకు పోకుండా బంధువులతో ఆదరంగా మెలగండి. బంధుమిత్రుల కలయికతో ఉత్సాహం చోటుచేసుకుంటుంది. దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తుతాయి. స్త్రీలకు షాపింగ్ విషయాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళకువ అవసరం.

g **తుల** : ఆత్మీయుల నుంచి అందిన ఆహ్వానం మిమ్ములను ఇరకాటానికి గురిచేస్తుంది. విలాసవస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. చేతి వృత్తులు, చిరు వ్యాపారులకు అన్నివిధాలా కలిసివస్తుంది. ప్రయాణాలలో ఇబ్బందులు తలెత్తుతాయి. నిరుద్యోగలకు రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు సత్ఫలితాలనిస్తాయి.

h **వృశ్చికం** : పాత మిత్రులను కలిసి వారికి శుభాకాంక్షలు అందజేస్తారు. నూతన పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగస్తులకు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. నూతన వస్త్రప్రాప్తి ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. రుణ విముక్తులు కావడంతో మానసికంగా కుదుటపడతారు.


i **ధనుస్సు** :రాజకీయ నాయకులు పార్టీ సభ్యులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. సంఘంలో మీ స్థాయి పెరుగును. పెద్దల ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యాపారరీత్యా దూరప్రయాణాలు చేస్తారు. బంధుమిత్రులకు, ప్రముఖులకు శుభాకాంక్షలు అందజేస్తారు. టెక్నికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్, రంగాల్లో వారికి ఒత్తిడి తప్పదు.

j **మకరం** :ఆర్థికంగా ఎదగాలనే మీ ఆశయం నిదానంగా ఫలిస్తుంది. కుటుంబీకులతో కలిసి విందులు, వినోదాలు, సమావేశాలు ఉల్లాసంగా కలిగిస్తాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తారు. ధనం చేతిలో నిలబడటం కష్టమే.

k **కుంభం** : విద్యార్థులకు హడావుడి, తొందరపాటు తగదు. వస్త్ర, బంగారం, వెండి, లోహ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది. విందు, వేడుకలలో చురుకుగా పాల్గొని అందరిని ఆకర్షిస్తారు. కళ, క్రీడా, సాంకేతిక రంగాలవారికి ప్రోత్సాహకరం. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం.

L **మీనం** : విందులలో పరిమితి పాటించండి. వాహనం ఇతరులకు ఇచ్చిఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉపాధ్యాయులు పైఅధికారులతో సంభాషించినపుడు మెళకువ అవసరం.

# సాయిబాబా చిన్న కథలు



### భక్త వాత్సల్యం


బెంగాలు రాష్ట్రంలో మాధవదాసు అనే భక్తుడు ఉండేవాడు. అతని భార్య మరణించింది. మాధవదాసుకు జీవితం మీద విరక్తి కలిగింది. ఆస్తిపాస్తులను అమ్మి వ్యవహారములనన్నింటిని చక్కజేసి, కాషాయ వస్త్రములను ధరించి పూరి క్షేత్రమునకు చేరాడు. పూరి క్షేత్రముల జగన్నాధుని సేవిస్తూ, ఆహర్నిశలూ జగన్నాధ నామస్మరణం చేసేవాడు. పగలంతా దేవాలయాములో గడిపి, రాత్రికి సముద్రపు ఒడ్డుకు చేరి ఇసుక మీద హాయిగా నిద్రించేవాడు. నిరవధిక ఉపాసన వలన అతనిలో వింత తేజస్సు, ఒక శక్తి ఆవిర్భవించినవి. ఒకనాడు జగన్నాధుడు, సోదరి సుభద్రతో సముద్ర తీరానికి వచ్చి, అక్కడ ఒక బంగారు పళ్లెమును పెట్టి అదృశ్యమయినాడు. మాధవ దాసునకు ఈ విషయం తెలియదు. అతడు మైమరచి నామ స్మరణం చేస్తున్నాడు. కొంతసేపటికి కన్నులు తెరిచాడు. ఎదురుగా ఒక పళ్ళెములో రుచికరమైన ఆహార పదార్థములుండడం చూశాడు. అతడు ఏ విధమైన భావము లేకుండా ఆ ఆహారమును భుజించి, మరల ధ్యానములో నిమగ్నుడైనాడు. అతనికి నిర్విచార స్థితి కలిగింది. బంగారు పళ్ళెము మీద అతని దృష్టి పడలేదు. ఆహారము ఏ విధంగా వచ్చినదీ అని కూడా ఆలోచించలేదు. ఆలయంలో జగన్నాధ స్వామికి రాత్రి వేళ మహా భోగమును నివేదన చేయు బంగారు పళ్లెము పూజారులకు కనబడలేదు. ఆలయ అధికారులు బంగారు పళ్లెమును తస్కరించిన దొంగలను వెదుకుటకు బటులను పంపాడు. సముద్రం ఒడ్డున ధ్యానంలో మాధవదాసు ఉన్నాడు.

అతని ముందర బంగారు పళ్ళెము ఉన్నది. భటులు మాధవదాసును బంధించి చెరసాలలో ఉంచారు. ఆరోజు రాత్రి జగన్నాధుడు ఆలయ పూజారికి కలలో కనిపించి, మీరందరూ నాకు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆహారమును నివేదన చేస్తారు. కానీ నేను తిన్నానని నన్ను కొట్టి హింసిస్తారు అని పలికి అదృశ్య మయినాడు. పూజారి భయపడుతూ నిద్ర లేచాడు. అతనికి ఇది కలయా! నిజమా! అని తెలియక అచేతనంగా కూర్చున్నాడు. ఆరోజు జరిగిన సంఘటనలను గుర్తుకు తెచ్చుకుని ఆలోచించ సాగాడు. మాధవదాసు మహా భక్తుడు.

అతనికి బంగారు పళ్లెములో ఆహారమును అందించినది జగన్నాధుడు. అనాధలకు నాధుడు జగన్నాధుడే కదా! అని నిర్ణయించి పూజారి, ఆలయ అధికారులకు తెలిపి మాధవదాసును చెరసాల నుండి విడిపించాడు. దీనికి మాధవదాసు పొంగిపోలేదు. దైవానుగ్రహము వలన మాధవదాసు కీర్తి ప్రతిష్ఠలు, భక్తిప్రపత్తులు దశదిశల వ్యాపించినవి.

... సశేషం

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

### 28వవార్డు మహిళలతో

# 'వంటా-వార్పు' కార్యక్రమం



విశాఖపట్నం : విభజన చట్టం మరియు విశాఖకు రైల్వేజోన్, కడపకు స్టీల్‌ప్లాంట్ అమలు చేసేంతవరకు కేంద్రంపై టీడీపీ పోరాటాలు ఆపే ప్రసక్తి లేదని విశాఖ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి విల్లూరి డాక్టర్ చక్రవర్తి స్పష్టం చేశారు. బుధవారం 28వవార్డులో వున్న వెంకటేశ్వర మెట్ట పైన డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహించిన 'వంటా-వార్పు' కార్య క్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్ మరియు విభజన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'వంటా-వార్పు' కార్యక్రమం ఆయన చేతుల మీదుగా చేపట్టారు. ఏపీలో జనసేన, వైఎస్సార్‌సీపీ ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నట్లు చెప్పారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే సరియైన గుణపాఠం చెప్తారని అన్నారు. ఏపీ అంటే బీజేపీకి ఎందుకంత చులకనో ఓటు ద్వారా ఓటర్లు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లో వున్నాయి అన్నారు. ప్రత్యేక హోదా తక్షణమే ప్రకటించాలని, ప్రాజెక్టులు పూర్తి చేయడానికి సత్వరమే నిధులు మంజూరు చేయాలని, విశాఖకు రైల్వే జోన్ వెంటనే ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం విభజన హామీలని వెంటనే అమలు చేయాలని 'ప్రత్యేక హోదా భిక్ష కాదు 5కోట్ల ఆంధ్రప్రజల హక్కు' అని 'ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి' అనే నినాదాలతో 'వంటా-వార్పు' కార్యక్రమం చేసి అనంతరం 200 మంది మహిళలు నడిరోడ్డు మీద కూర్చొని భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి, మహిళా సంఘాల అధ్యక్షురాలు విల్లూరి తిరుమలదేవి, తెలుగుయువత నాయకులు జాగరపు చిన్న, బర్రి సత్య, సనపల లక్ష్మి, సింగంపల్లి మాధవి, ఎస్.కె.ఫాతిమా, గాడి గౌరమ్మ, పూడి చంద్రమ్మ తదితర మహిళా కార్యకర్తలు మరియు మహిళలు పాల్గొన్నారు.

# యువకులు సేవాభావం కలిగి ఉండాలి

### ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్



భీమునిపట్నం : యువకులు సేవా భావం కలిగి ఉండాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎ.సంపత్ కుమార్ అన్నారు. భీమిలి మండలం లోని మజ్జివలస గ్రామంలో మహారాజ రెండవ విజయ రామరాజు మెమోరియల్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావంతో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని అన్నారు. ఇంకా ఈ కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటా చారి, ఎన్ఎస్ఎస్ పీవో టి. చంద్రయ్య, ఎ.యు వైస్ ఛాన్సలర్ సతీమణి విజయకుమారి, మాన్సాస్ కరస్పాండెంట్ డొ.డి.ఆర్.కె రాజు,మజ్జివలస సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, ఎమ్పీటీసీ మొకర సూర్యకాంతం,పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

### 'స్మార్ట్ ఇండియా హాకాథాన్-2018'లో

# ప్రథమ విజేతలుగా నిలిచిన విద్యార్థులు



విశాఖపట్నం: మన దేశంలో డిజిటల్ డివైడున్న వంతెన చేయడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'డిజిటల్ ఇండియా'ను రూపొందించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి, ఎంహెచ్ ఆర్‌డి, ఎఐసిటిఇ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ ఇన్నోక్యువ్ ఇన్నోవేషన్ సెంటర్, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ స్మార్ట్ ఇండియా హాకాథాన్- 2017ను నిర్వహించి, నూతన డిజిటల్ టెక్నాలజీ ఆవిష్కరణలను గుర్తించడానికి భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. మన ప్రధానమంత్రి 'స్మార్ట్ ఇండియా హాకాథాన్-2018'ను ప్రతిపాదించారు. ఈ కార్య క్రమంలో దాదాపు 27 కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలు మరియు 18 రాష్ట్ర ప్రభుత్వాలు పాల్గొన్నాయి. విద్యార్థిని, విద్యార్థులకు 408 సమస్య నివేదికలు ఇచ్చాయి. దాదాపు 105234 కంటే ఎక్కువ మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, అందులోనుండి 10,000 మంది విద్యార్థులను దేశవ్యాప్తంగా ఎంపిక చేసి 1296 టీంలుగా ఎంపిక చేయడం జరిగింది. యువతలో నుండి దేశానికి ఉప యోగపడే వినూత్నమైన ఆలోచ నలను బయటికి తీసుకురావడానికి హోరాహోరీ పోటీలను నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి విశాఖపట్నం, పెందుర్తి మండలంలో గల వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల నుండి ఎంపిక అయిన బృందాలలో ఐఓటి పార్కెర్స్ మొదటి బహుమతి సాధించారు. వారు చూపిన ప్రతిభకు భారతదేశంలోనే గర్వకారణమైన 'స్మార్ట్ ఇండియా హాకాథాన్-2018'లో ప్రథమ విజేతలగా నిలిచి రూ.1,00,000,00 (లక్ష రూపాయల) నగదు బహుమతి సాధించారు. దానితో పాటు విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కూడా వచ్చినందున ఇంకా సంతోషాన్ని వ్యక్తపరు స్తున్నారు. ఈ విజయం సాధించడానికి కళాశాల యాజమాన్యం ఛైర్మన్ డా.మళ్ళ విజయప్రసాద్, ప్రిన్సిపాల్ డా.యం.జేమ్స్ స్టీఫెన్, విభాగాధిపతి కె.వెంకటలక్ష్మి ఎంతో ఆర్థిక, సహాయ సహకారాలు అందించారు.

### గ్రామీణ వైద్యుల సంఘం

# కార్యవర్గ సమావేశం



భీమునిపట్నం : ఆర్ఎంపీలు ఉన్నది సామాజిక కార్యక్రమాలు చేయడం కోసమే నని విశాఖ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంగా ప్రసాద్ అన్నారు. భీమిలి మండల కార్యవర్గ సమావేశం తగరపువలస లో జరిగింది . ఈ కార్యక్రమంలో మంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆర్ఎంపీలు సామాజిక కార్యక్రమాలు చేయాలని తెలిపారు. స్వచ్ఛందంగా పాల్గొని దోమల నియంత్రణ, పచ్చదనం, పరిశుభ్రత తదితర కార్యక్రమాలు చేయాలని జోనల్ కార్యదర్శి ఐ.గోపి పిలుపునిచ్చారు.అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా వెంపాడ. అప్పలకారురెడ్డి,కార్యదర్శి గా ఎ.రఘుబాబు, ఉపాధ్యక్షుడు గా ఎన్. రామకృష్ణ, సహాయ కార్యదర్శి గా ఎల్.లక్ష్మీ నారాయణ, మహిళా కార్యదర్శిగా ఎం.రేవతి లు ఎన్నికయ్యారు.



**స్టేట్ హెల్త్ బులెటిన్‌ను బుధవారం గౌరవనీయులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేశారు. దానిని అనుసరించి మన విశాఖ జిల్లాకు సంబంధించిన జిల్లా హెల్త్ బులెటిన్‌ను కలెక్టర్ ప్రవీణ్ కుమార్ విడుదల చేయడం జరిగింది.**

# హోదాపై ఉద్యమం ఉధృతం



విశాఖపట్నం: ప్రత్యేక హోదా సాధన కోసం చేస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ విశాఖ నగర అధ్యక్షుడు డాక్టర్ విజయ ప్రసాద్ మళ్ళ అన్నారు. ఈ ఉద్యమంలో అన్ని పార్టీలతో కలిసి వెళ్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ పార్టీ ఏ స్థాయి ఉద్యమానికి అయినా సిద్ధంగా వుందని తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అఖిలపక్ష పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోదా, రైల్వే జోన్, విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చనందుకు ఈనెల 5వతేదీ సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు సుమారు అరగంట సేపు విద్యుత్‌ను నిలిపివేసి తమ నిరసనను తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పైడిరాజు, సీపీఎం గంగారాం, పోరాట సమితీ అధ్యక్షుడు నారాయణ, కాంగ్రెస్ ఎంఎస్.రాజు, సుధాకర్, తాతారావు, ఉత్తరాంధ్రా చర్చావేదిక నాయకులు శివశంకర్, నాగబోయిన నాగేశ్వరరావు సీతల్ తదితరులు పాల్గొన్నారు.

### వడగాల్పులు తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం : వేసవిలో వడగాల్పులకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయపు ఆవరణలో జిల్లా విపత్తుల నివారణ సంస్థ, సత్యసాయి సేవాట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని, స్వచ్ఛంద స ంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని కోరారు.

### పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా

# డా.రామకృష్ణకు బాధ్యతలు అప్పగింత

విశాఖపట్నం: నిబంధనలకు విరుద్ధంగా అధికారిక పత్రాలను బహిర్గతం చేసి ద్వారా ఉద్యోగ నియమ నిబంధనావళిని ఉల్లంఘించినందున, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టరు డా.ఎన్.కోటేశ్వరరావును, పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎస్.సూర్యప్రకాష్‌రావులను ప్రభుత్వానికి సరండరు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇటీవల జిల్లా పశు గణాభివృద్ధి సంఘం ఎన్నికలపై వస్తున్న ఆరోపణలపై జిల్లా కలెక్టర్ తన బంగ్లాలో అధికారులతో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికార పత్రాలను పబ్లిక్ డొమైన్‌లో బహిర్గతం చేయడంపై తీవ్రంగా పరిగణించిన ఆయన అధికార్లనిద్దరిని ప్రభుత్వానికి సరండరు చేస్తూ లేఖ రాశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ బాధ్యతలు నిర్వర్తించాల్సిందిగా పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టరు డా.రామకృష్ణకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఛైర్మన్ ఎన్నికల నిలుపుదల చేసినందున ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వ్యవహరించాల్సిందిగా విశాఖపట్నం జాయింట్ కలెక్టర్-2 డా.సిరికు ఉత్తర్వులు జారీ చేశారు.

# నేడు బ్లాక్ డే

భీమునిపట్నం : కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతో నిరసనగా ఈనెల 5 గురువారం అనగా ఈరోజు బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు అల్లు.బాబూరావు తెలిపారు.తగరపువలస సిపిఐ కార్యాలయంలో వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. అందువల్ల ఈనెల 5న రాత్రి ఏడు గంటల నుంచి ఏడున్నర గంటల వరక విద్యుత్ దీపాలు ఆపి చీకట్లో ఉండాలనీ కోరారు. ఇంకా ఈ సమావేశంలో ద్వారకృష్ణ,మావూరి వీర్రాజు, సరగడ ఈశ్వర్రావు(సిపిఐ),ఎల్లపు సత్యారావు(కాంగ్రెస్), జనసేన, వైకాపా, అంద్రచైతన్య పార్టీ, ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్ట్



విజయనగరం: స్థానిక ఒన్‌టౌన్ పరిధిలో తోటపాలెం, ఉడాకాలనీలో ఇళ్ళల్లో చోరీకి పాల్పడిన పాలనేరస్థులను బుధవారం నాలుగు గంటలకు అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలా భాస్కరరావు, (సీతానగరం ) ఈ రోజు స్థానిక లీలామహల్ జంక్షన్ వద్ద ఉండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు నేరసుడను పట్టుకున్నారు. అలాగే అదే సమయంలో 2017 కొత్తవలస కొత్తూరు గ్రామానికి చెందిన బోదెల అప్పల నాయుడు(40) విజయనగరం కన్యకాపరమేశ్వకోవెల దగ్గర పట్టుకున్నారు. వారిద్దరి నుంచి 4.5 తులాల బంగారాన్ని స్వాధీన పర్చుకున్నారు. ఈ కేసుదర్యాప్తులో సిసిఎస్. డిఎస్పీ ఏ.ఎస్.చక్రవర్తి, సిఐలు బి.చంద్రశేఖర్, ఎం.కృష్ణమూర్తి, కొత్తవలస ఎస్.ఐ కె.నీలకంఠం, ఎస్ఐలు నరేష్, కె.నీలకంఠం, పి.సి కానిస్టేబుళ్ళు వై.నాగేంద్ర, టి.శ్రీనివాసరావు, ఎం.అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీలు ఆందోళన

కొయ్యూరు : అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు బయోమెట్రిక్ వేయాలన్న ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోవాలని బుధవారం సిఐటియు నేతలు, అంగన్వాడీ వర్కర్ల ర్యాలీ నిర్వహించారు. బుధవారం అంగన్వాడీ అధ్యక్ష కార్యదర్శులు ఎల్.ముత్యాలమ్మ, ఎస్.బాలమ్మలతో కలిసి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గౌతమికి వెసిఐటియు నేతలు వై.అప్పల నాయుడు, ఎస్.సూరిబాబు, పి.సూర్యకళ, ఎస్.రమణమ్మ, డి.రాజేశ్వరి పాల్గొన్నారు.

**IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**
**O.S.1119/2016**
**Between:**
**Mr. Devara Kanaka Raju ...Plaintiff**
**And:**
**Mr. Thokala Jagadeesh Kishore Babu ...Defendant**
**To**
**THE DEFENDANT:**
**Mr. Thokala Jagadeesh Kishore Babu**
**S/o. Subba Rao,**
**Residing at 4-1-7/5,**
**Pedawaltair,**
**Visakhapatnam.**

**NOTICE**

Please take notice that the above suit filed by the Plaintiff against you for permanent Injunction and the Honourable court was pleased to order notice to you through this publication. Hence you are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed on **27-04-2018, at 10-30A.M.,** If you are fails to appear before the Honourable Court on that day, the matter will be heard in your absence and necessary orders will be passed.

**Adjournment Date : 27-04-2018**

**N.S.V.Reddy**
**Advocate**
**49-36-47**
**Venumadhavi Villa,**
**N.G.G.O's Colony,**
**Visakhapatnam.**
**Phones : 9393102036**
**0891-2706699**
Visakhapatnam,
Date:02-04-2018

**IN THE HONOURABLE COURT OF THE I ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM.**
**I.A.542/2016 IN O.S.1119/2016**
**Between:**
**Mr. Devara Kanaka Raju ...Petitioner/Plaintiff**
**And:**
**Mr. Thokala Jagadeesh Kishore Babu ...Respondent/Defendant**
**To**
**THE RESPONDENT:**
**Mr. Thokala Jagadeesh Kishore Babu**
**S/o. Subba Rao,**
**Residing at 4-1-7/5,**
**Pedawaltair,**
**Visakhapatnam.**

**NOTICE**

Please take notice that the above I.A., filed by the petitioner against you along with the above suit for exparte temporary Injunction and the Honourable court was pleased to order notice to you through this publication. Hence you are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed on **27-04-2018, at 10-30A.M.,** If you fail to appear before the Honourable Court on that day, the matter will be heard in your absence and necessary orders will be passed.

**Adjournment Date : 27-04-2018**

**N.S.V.Reddy**
**Advocate**
**49-36-47**
**Venumadhavi Villa,**
**N.G.G.O's Colony,**
**Visakhapatnam.**
**Phones : 9393102036**
**0891-2706699**
Visakhapatnam,
Date:02-04-2018

**BEFORE THE HONOURABLE DISTRICT CONSUMER FORUM-1 AT VISAKHAPATNAM.**
**C.C.No.317 OF 2017**
**Between :**
**1) Dr.Gopisetti Sai Gopal,**
**2) Smt. Gopisetti Sujatha ...COMPLAINANTS**
**And**
**1) UAE XCHANGE,**
**2) Sri Srinivas Kumar Akula, Branch Head - UAE XCHANGE ...OPPOSITE PARTIES**
**To**
**OPPOSITE PARTIES**
**1. UAE XCHANGE, 2-30-26/1, Sector-VI, Jami Function Hall Building, MG Cancer Hospital Road, Visakhapatnam-530 017.**
**2.Sri Srinivas Kumar Akula, Branch Head - UAE XCHANGE, 2-30-26/1, Sector-VI, Jami Function Hall Building, MG Cancer Hospital Road, Visakhapatnam-530 017.**

Please take notice that the above application, as you are avoiding to receive Summons, the Honourable Court ordered publication in this paper by way of notice to you under Order-5 Rule-20 of C.P.C. The matter is posted for your appearance in person or through duly instructed Advocate at **10.30 A.M. on 20-04-2018.** If you fail to attend, the matter will be disposed of by the Honourable Court according to Law without any further notice to you.

**M/s.LANKA VENKATESWARLU & Co.,**
**Sri Lanka Jagannadham**
**Sri. Lanka Venkateswarlu**
**Advocates**
**17-Rajendra Nagar,**
**Visakhapatnam-530 016.**

**వేలము ప్రకటన**
**మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు**
**O.S.75 of 2011 E.P.191 of 2014**
**Between:**
**అయితంశెట్టి బలరాం ...డిక్రీ హోల్డరు**
**And :**
**నానిపల్లి ఈశ్వరరావు వగైరా ...జడ్జిమెంటు డెటారు**

పై నెంబరు అమలులో యిందలి దావా డిక్రీ బకాయి అసలు వృద్దులు రాబట్టే నిమిత్తము యీ దిగువ నుదహరించిన షెడ్యూలు భూములను పై కోర్టు వారు **తే.16-04-2018దీ ని ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు** బహిరంగముగా వేలము వేయబడును. కావున కావలసిన వారు సదరు వేలములో పాల్గొనవలసినదిగా యిందుమూలముగా తెలియచేయడమైనది. ఇతర వివరములకు డిక్రీ హోల్డరు వకీలు గారి ఆఫీసులో తెలుసుకొనవచ్చును.

**షెడ్యూలు**

విజయనగరము జిల్లా, కొత్తవలస సబురిజిస్ట్రారు యిలాకా లక్కవరపు కోట మండలం, వీరభద్రపేట పంచాయితీ వీరభద్రపేట గ్రామంలో గల పల్లం భూముల వివరములు

**(1) సర్వే నెంబరు 11/1 య0.40 శెంట్లు విస్తీర్ణంకు హద్దులు**
తూ॥ గుంట్రోతు శ్రీరాములు జిరాయితీ పల్లం
ద॥ నానిపల్లి కొండమ్మ జిరాయితీ పల్లం
ప॥ నానిపిల్లి ఈశ్వరరావు మరియూ తాతబాబు జిరాయితీ పల్లం
వు॥ పోతల అప్పలనాయుడు జిరాయితీ పల్లం
డిక్రీ హోల్డరు విలువ రూ.12,000/- అమీను విలువ రూ.2,00,000/-
**(2) సర్వే నెంబరు 10/6 యం-20 శెంట్లు విస్తీర్ణంకు హద్దులు**
తూ॥ నానిపల్లి ఈశ్వరరావు మరియూ తాతబాబు జిరాయితీ పల్లం
ద॥ నానిపల్లి త్రిమూర్తులు జిరాయితీ పల్లం
ప॥ నానిపల్లి అప్పారావు జిరాయితీ పల్లం
వు॥ నానిపల్లి కొండమ్మ జిరాయితీ పల్లం
డిక్రీ హోల్డరు విలువ రూ.6,000/- అమీను విలువ రూ.1,00,000/-
**(3) సర్వే నెంబరు 10/19 యం-10శెంట్లు విస్తీర్ణంకు హద్దులు:**
తూ॥ నానిపల్లి ఈశ్వరరావు మరియూ తాతబాబు జిరాయితీ పల్లం
ద॥ నుయ్యి గట్టు
ప॥ నానిపల్లి ఈశ్వరరావు జిరాయితీ పల్లం
వు॥ నానిపల్లి తాతబాబు జిరాయితీ పల్లం
డిక్రీ హోల్డరు విలువ రూ.3,000/- అమీను విలువ రూ.50,000/-
**(4) సర్వే నెంబరు 10/19 యం-05 శెంట్లు విస్తీర్ణంకు హద్దులు**
తూ॥ యిందలి మూడవ ప్రతి
ద॥ నానిపల్లి ఈశ్వరరావు పల్లం భూమి
ప॥ నానిపల్లి కొండమ్మ జిరాయితీ పల్లం
వు॥ కొట్యాడ దేవుడు జిరాయితీ పల్లం
డిక్రీ హోల్డరు విలువ రూ1,500/- అమీను విలువ రూ.25,000/-
**(5) సర్వే నెంబరు 7/16 యం-20శెంట్లు విస్తీర్ణంకు హద్దులు**
తూ॥ నానిపల్లి అప్పారావు మరియు సూర్యనారాయణ జిరాయితీ పల్లం
ద॥ తూర్పాటి లక్ష్మునాయుడు పల్లం
ప॥ కొట్టాన రామకృష్ణమ్మ జిరాయితీ పల్లం
వు॥ నానిపల్లి అప్పారావు జిరాయితీ పల్లం
డిక్రీ హోల్డరు విలువ రూ.6,000/- అమీను విలువ రూ.1,00,000/-

**పిలకా శేషాద్రి**
**డిక్రీ హోల్డరు అడ్వకేటు**
సెల్ నెంబరు : **9866478843**

# చిత్రభాను

## ఐపీఎల్‌లో తమన్నా అందాల చౌన్సర్లు..



భారతీయులకు క్రికెట్ ఎంత మక్కువో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పొట్టి క్రికెట్ ఫార్మాట్ టి 20 లలో ఐపీఎల్ సరికొత్త విప్లవం తీసుకునివచ్చింది. వేలకోట్ల రూపాయల బిజినెస్ ఐపీఎల్ ద్వారా జరుగుతుంది. భారత క్రికెట్ బోర్డుకు ఐపీఎల్ కాసులు కురిపించే కల్ప తరువుగా మారిపోయింది. ఐపీఎల్ 2018 కు రంగం సిద్ధమైపోయింది.

ఏప్రిల్ 7 ప్రారంభోత్సవ వేడుకతో ఐపీఎల్ పండుగ ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవ వేడుకలో బాలీవుడ్ తారల అందాలు, వారి న ృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా మారనున్నాయి. ఐపీఎల్ ప్రారంభోత్సవ వేడుకలో బాలీవుడ్ తారలు వారి పెర్ఫామెన్స్ తో ఆకట్టుకోబోతున్నారు. ఏప్రిల్ 7 న అట్టహాసంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం కాబోతోంది. గత ఏడాది మెరిసింది వీరే గత ఏడాది ఐపీఎల్ సీజన్ ప్రారంభోత్సవ వేడుకలో పరిణీతి చోప్రా, అమీ జాక్సన్ మరియు దిశా పటాని తాం పెర్ఫామెన్స్ తో ఆకట్టుకున్నారు. మిల్కీ బ్యూటీ అందాల అట్రాక్షన్ ఈ ఐపీఎల్ ప్రారంభోత్సవ వేడుకలో మిల్కీ బ్యూటీ తమన్న తన అందాలతో వేడెక్కించనుంది. తమన్నా యువతలో ఉన్నా ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సౌత్ లో మాత్రమే కాక తమన్నా బాలీవుడ్ చిత్రాలలో సైతం నటించింది. ఆ నలుగురు కూడా తమన్నాతో పాటు మరి కొంత మంది బాలీవుడ్ తారలు ఐపీఎల్ వేదికపై మెరుపులు మెరిపించబోతున్నారు. జాక్వలిన్ ఫెర్నాండేజ్ మరియు పరిణితో చోప్రా ఐపీఎల్ వేదికపై డాన్స్ పెర్ఫామెన్స్ చేబోతున్నట్లు తెలుస్తోంది. ప్రారంభోత్సవ వేడుకలో స్టార్ హీరోలు హ ృతిక్ రోషన్ మరియు వరుణ్ ధావన్ కూడా పాల్గొనబోతున్నారు. రణవీర్ సింగ్ పాల్గొనాల్సి ఉండగా భుజం గాయం కారణంగా తప్పుకున్నాడు.

# వన్నెతగ్గని ఐశ్వర్యం!



బాలీవుడ్ అందాలతార ఐశ్వర్యారాయ్ వయసు మీదపడుతున్నా వన్నెతగ్గని అందంతో అలరారుతున్నది. దాదాపు 24 ఏళ్ల క్రితం ప్రపంచసుందరి కిరీటాన్ని దక్కించుకున్న ఈ సొగసరి ఇప్పటికీ అదే అందంతో మెరిసిపోతున్నది. అభిషేక్ బచ్చన్‌ని పెళ్లాడి ఓ పాపకు జన్మనిచ్చినా ఐష్ సౌందర్యం ఏమాత్రం తగ్గలేదు. ఐదేళ్ల పాటు సినిమాలకు దూరంగా వుంటూ వచ్చిన ఆమె జజ్బాచిత్రంతో రీఎంట్రీ ఇచ్చింది. కరణ్‌జోహార్ తెరకెక్కించిన ఏ దిల్ హై ముష్కిల్ సినిమా సమయంలో సహనటుడు రణబీర్‌కపూర్‌తో కలిసి ఫొటోషూట్‌లో పాల్గొన్న ఐష్ తన క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. నలభయ్యవపడిలో వున్న ఈ అందాలరాశి క్రేజీ ఫొటోల కోసం అంతర్జాతీయ పాపులర్ మ్యాగజైన్స్ పోటీపడుతుండటం విశేషం అని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. రెండేళ్ల విరామం అనంతరం రాజ్‌కుమార్ రావుతో కలిసి ఫన్నేఖాన్ చిత్రంలో నటిస్తున్న ఐశ్వర్యారాయ్ తాజాగా మరో ఫొటోషూట్‌తో వార్తల్లో నిలిచింది. అంతర్జాతీయ మ్యాగజైన్ వోగ్ నిర్వహించిన ఫొటోషూట్‌లో ఐశ్వర్య పాల్గొంది. ప్రముఖ అమెరికన్ గాయకుడు విలియం ఫ్యారెల్‌తో కలిసి తెలుపు, ఎరుపు, నీలం రంగు దుస్తుల్లో పోజిచ్చిన ఐష్ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## నిహారికకు బంపర్ ఆఫర్..



ఒక మనసు చిత్రంతో కొణిదల వారి అమ్మాయి నిహారిక నటిగా మారింది. తొలి ప్రయత్నం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయినా కూడా నిహారిక నటిగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఒక మనసు చిత్రం తరువాత నిహారిక ఆచి తూచి అడుగులు వేస్తోంది. కేవలం తెలుగులో మాత్రమే కాకా తమిళ చిత్రాల్లో కూడా నటిస్తోది. కెరీర్ ని ఇప్పుడిప్పుడే మలచుకునేందుకు ప్రయత్నం చేస్తున్న నిహారికకు బంపర్ ఆఫర్ వచ్చినట్లు ఇండస్ట్రీలో వార్తలు వినిపిస్తున్నాయి. తన పెదనాన్న మెగాస్టార్ చిరంజీవి చిత్రంతో నటించే అవకాశం నిహారికకు వచ్చినట్లు తెలుస్తోంది. మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన తొలి నటి నిహారిక. ఒక మనసు చిత్రంతో నిహారిక హీరోయిన్ గా మారింది. ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించినప్పటికీ నటిగా నిహారికకు మంచి మార్కులు పడ్డాయి. తెలుగు, తమిళ చిత్రాల్లో నిహారిక కేవలం తెలుగు చిత్రాలలోనే కాక తమిళ చిత్రాలలో సైతం నటించేందుకు ఆసక్తి చూపుతోంది. తమిళ ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి చిత్రంలో నిహారిక నటిస్తోంది. అలాగే తెలుగులో సుమంత్ అశ్విన్ సరసన హ్యాపీ వెడ్డింగ్ చిత్రంలో నటిస్తోంది. పెదనాన్న చిత్రంలో బంపర్ ఆఫర్ నిహారిక తాజాగా ఓ బంపర్ ఆఫర్ సొంతం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం సైరా నరసింహారెడ్డి చిత్రంలో కీలక పాత్రలో నటించేందుకు నిహారికకు అవకాశం వచ్చిందనేది ఈ వార్తల సారాంశం. కెరీర్ కు పెద్ద బూస్ట్ సైరా చిత్రంలో నటించే అవకాశం రావడం నిహారిక కెరీర్ కు పెద్ద బూస్ట్ అని అంటున్నారు.



## పల్లెటూరుతో అనుబంధం లేదు



రంగస్థలం సినిమాకు ముందు నాకు పల్లెటూరు సినిమాతో పెద్దగా అనుబంధం లేదు. మా నాన్న ఊరు పోచంపల్లి గ్రామం. కానీ ఆ ఊరికి ఒక్కసారి మాత్రమే వెళ్లాను. మాది తాత, అమ్మమ్మ వాళ్లది ఘట్‌కేసర్. మా తాత ఊరికి సర్పంచ్‌గా ఉండేవారు. అప్పట్లో ఆ ఊరికి వెళ్లినపుడు నన్ను దొరసాని అనేవారు. అంతేతప్ప నాకు పెద్దగా పల్లెలతో పెద్దగా పరిచయం లేదు. రంగస్థలం సినిమాతోనే పూర్తిగా పల్లెతో అనుబంధం ఏర్పడింది. సెట్ చూసి ఆశ్చర్యపోయాను రంగస్థలం సినిమా కోసం పాపికొండలు ప్రాంతంలోని కొన్ని ఊర్లలో షూట్ చేశాం. ఆ తర్వాత జూబ్లీహిల్స్‌లో వేసిన సెట్‌లో షూట్ చేశాం. మొదట్లో అది నిజంగా ఊరు అని అనుకొన్నాను. తర్వాత రామక ృష్ణ వేసిన సెట్ అని చెప్పడంతో ఆశ్చర్యపోయాను. గోదావరి జిల్లాలోని ఓ ఊరును ఆంజనేయుడు సంజీవిని పర్వతంగా లేపుకొచ్చినట్టు ఇక్కడ స ృష్టించారు. నచ్చకపోతే అసహ్యించుకొంటారని రంగమ్మత్త క్యారెక్టర్ గురించి నాకు చెప్పినపుడు రెండు రకాలుగా ఆలోచించాను. ఒకవేళ నచ్చితే ప్రేక్షకులు విపరీతంగా మెచ్చుకొంటారు. లేకపోతే పక్కన పెడుతారు అని అనుకొన్నాను. లక్కీగా ప్రేక్షకులు ఆ పాత్రను బాగా ఆదరిస్తున్నారు. నాకున్న ఇమేజ్‌కు భిన్నంగా ఉన్న రంగమ్మత్త రోల్ చేశాను. ఆ పాత్ర చేయడానికి ముందు చాలా ఆలోచించాను. ఆ పాత్ర చేసేటప్పుడు కొన్ని పొరపాట్లు చేశాను. ఓ తప్పు చేస్తేనే తప్పు అని తెలుసుకొనే అవకాశం ఉంటుంది.

రంగమ్మత్తగా మేకప్, గెటప్ వేసుకొన్న అనసూయ అనే విషయాన్ని మరచిపోయాను. ఆ తర్వాత నా టెలివిజన్ ఇమేజ్‌ను, నా సొంత ఆలోచనలను దూరంగా పెట్టాను. అందుకే ఈ రోజు చాలా మంది నా పాత్రను, నా నటనను ప్రశంసిస్తున్నారు. షూట్‌లో ఉన్నంత సేపు రంగమ్మత్త అని పిలిచేవారు. దాంతో నేను నిజంగానే రంగమ్మత్తగా మారిపోయాను. రంగమ్మత్త పాత్రలో నన్ను చూసి నాకు చాలా మంది డైరెక్టర్లు ఫోన్ చేసి ప్రశంసించారు. నీ టాలెంట్ ఇంత చెండాలంగా వాడుకొన్నామా? అని కొందరు డైరెక్టర్ నాతో అన్నారు. అందుకు సమాధానంగా ఇప్పుడు నాకోసం మంచి పాత్రలు రాసుకోండి అని వారికి చెప్పాను.

## పాప్‌స్టార్ జెన్నిఫర్ లోపెజ్ ఇంట్లో రవితేజ మూవీ

రవితేజ హీరోగా దర్శకుడు శ్రీను వైట్ల తెరకెక్కిస్తున్న 'అమర్ అక్బర్ ఆంటోనీ' చిత్రం ప్రస్తుతం యూఎస్‌ఏలో షూటింగ్ జరుపుకుంటోంది. రవితేజతో పాటు ఇతర ముఖ్య తారాగణంపై మార్చి 26 నుండి ఇక్కడ షూటింగ్ ప్రారంభం అయింది. తొలుత న్యూయార్క్‌లో కొన్ని సీన్లు చిత్రీకరించిన అనంతరం షూటింగ్ కాలిఫోర్నియాకు షిఫ్టయింది.

కాలిఫోర్నియా సమీపంలోని లాంగ్ ఐలాండ్‌లో ప్రముఖ హాలీవుడ్ పాప్ స్టార్ జెన్నిఫర్ లోపెజ్‌కు సంబంధించిన భవనం పలాటియల్ హిడెన్ హిల్స్ మాన్షన్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ఈ విషయాన్ని శ్రీను వైట్ల ట్విట్టర్ ద్వారా తెలియజేస్తూ ఎగ్జైట్మెంట్ వ్యక్తం చేశారు. 'జెన్నిఫర్ లోపెజ్‌కు ప్రపంచ వ్యాప్తంటగా మిలియన్ల కొద్దీ వీరాభిమానులు ఉన్నారు. వారిలో నేనూ ఒకడిని. క్వీన్ ఆఫ్ పాప్ నివాసమైన పలాటియల్ మాన్షన్‌లో మా తాజా చిత్రం అమర్ అక్బర్ ఆంటోనీ సినిమాను చిత్రీకరిస్తున్నాం. నా కల నిజమైంది. ఇది నా బిగ్గెస్ట్ ఫ్యాన్ మూవెంట్' అని శ్రీను వైట్ల ట్వీట్ చేస్తూ ఓ వీడియో షేర్ చేశారు. సినిమాలో ఈ బంగళా స్పెషల్ అట్రాక్షన్ జెన్నిఫర్ లోపెజ్‌కు చెందిన అత్యంత విలాసవంతమైన భవనం ఇది. దీని ఖరీదు %వి%12.5 మిలియన్ డాలర్లు. గతంలో ఆమె ఈ ఇంట్లో తన మాజీ భార్త మార్క్ ఆంటోనీతో కలసి కొంతకాలం నివసించారు. 17000 స్కేర్ ఫీట్ల విస్తీర్ణం ఉన్న ఈ భవనంలో విలాసవంతమైన సదుపాయాలు ఉన్నాయి. రినోవేటెడ్ కిచెన్. రివాంప్డ్ మాస్టర్ బెడ్ రూం, స్పాతో కూడిన స్విమ్మింగ్ పూల్, రికార్డింగ్ స్టూడియో, జిమ్, 20 మంది కూర్చొని చూడగలిగే మూవీ థియేటర్, గేమ్ రూమ్, బార్, గెస్ట్ సూట్ ఉన్నాయి. అమర్ అక్బర్ ఆంటోనీ సినిమాలో ఈ భవనం స్పెషల్ అట్రాక్షన్‌గా ఉంటుందని చెబుతున్నారు.



## దేశాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర

# ప్రశంసనీయం

### ఎల్.కె. ఆద్వానిని కోరిన వి.జె.ఎఫ్. అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు



విశాఖపట్నం : భారతదేశ అభివృద్ధిలో జర్నలిస్టులు కీలకమైన పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు ప్రశంసనీయమని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ఆలిండియా డెమొక్రటివ్ పార్టీల అధ్యక్షులు ఎల్.కె. ఆద్వానీ కొనియాడారు. బుధవారం పార్లమెంటు భవన్‌లో వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు నేతృత్వంలో పలువురు జర్నలిస్టులు ఆద్వానిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆద్వానితో ఆయా రాష్ట్రాలు జర్నలిస్టులు అందిస్తున్న సేవలను శ్రీనుబాబు విపులంగా వివరించారు.

ఉత్తరాది కంటే దక్షిణాది రాష్ట్రాలు కొంత అభివృద్ధిలో వెనుకబడ్డాయని వాటి అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల వెనుకుబాటుతనాన్ని తెలియజేశారు. దక్షిణాది ప్రాంతాల అభివృద్ధికి మీడియా పూర్తిస్థాయిలో కృషిచేస్తుండటం అభినంద నీయమని ఆద్వాని అభినందించారు.

ఈ సందర్భంగా ఆద్వానికి జర్నలిస్టుల సేవలను శ్రీనుబాబు వివరించారు. ఎల్.కె. ఆద్వానిని కలుసుకున్నవారిలో భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకులు చెరువు రామకోటయ్య, ఎ.యు. విద్యార్థి సంఘం నేత దాసరి కిషోర్, పలువురు స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆద్వానీకి ఆయా అంశాలకు సంబంధించిన వినతిపత్రాలను అందజేశారు.

## కామన్వెల్త్ క్రీడలు ప్రారంభం

గోల్డ్‌కోస్ట్ (ఆస్ట్రేలియా): ఒలింపిక్స్, ఆసియా క్రీడల తర్వాత అతి పెద్ద క్రీడా సంబరమైన కామన్వెల్త్ క్రీడలకు తెరలేచింది. గోల్డ్‌కోస్ట్‌లోని కరారే స్టేడియంలో 21వ కామన్వెల్త్ క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్టార్ షట్లర్ పీవీ సింధు మువ్వెన్నెల జెండాను చేత పట్టుకుని ప్రారంభ కార్యక్రమంలో భారత బృందానికి నాయకత్వం వహించింది. సింధు జాతీయ పతాకాన్ని పట్టుకుని ముందు నడవగా క్రీడాకారులందరూ ఆమెను అనుసరించారు. 218 మందితో కూడిన బలమైన జట్టుగా భారత్ బరిలోకి దిగింది. 18 క్రీడాంశాల్లో 71 దేశాల తరపున 6,600కు పైగా క్రీడాకారులు బరిలోకి దిగుతున్నారు.

## హెూదా సాధనలో టీడీపీ, వైకాపా విఫలం

- ప్రజల నమ్మకాన్ని పాలకపక్షం వమ్ము చేసింది
- ఢిల్లీ వెళ్లిన బాబు ఏం సాధిస్తారని ఈ రాజకీయం
- కాంగ్రెస్ ద్వారానే ప్రత్యేక హెూదా సుసాధ్యం
- నగర పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు



విశాఖ సిటీ : హెూదా సాధనలో పాలక, ప్రతిపక్షాలు పూర్తిగా విఫలమైనవని పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పిలుపు మేరకు జీవీఎంసీ ఎదుట వున్న గాంధీ విగ్రహం వద్ద రెండో రోజు బుధవారం నిరసన దీక్ష కొనసాగింది.

ఈ సందర్భంగా ద్రోణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎంతో నమ్మకంతో టీడీపీ, బీజేపీలకు అధికారం ఇస్తే నేడు ఆ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని దుయ్యబట్టారు. పాలనలో ఆ రెండు పార్టీలు విఫలమైతే ప్రతిపక్ష వైసీపీ చేష్టలుడిగి చూస్తోందని అన్నారు. ఈ మూడు పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేనందున ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కడ ఓడిపోతోమోనన్న భయంతో ప్రత్యేక హోదా కావాలని అడుగుతున్నారన్నారు. కానీ, వారికి చిత్తశుద్ధి లేదని అన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ హోదా కోసం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఒక్కటే పోరాడుతున్నదని, ప్రజలలో ఆ పార్టీల పట్ల యావగింపు కలగడంతో నేడు హోదా కోసం పోరాటం ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. నాలుగు సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉన్నప్పుడు సాధించలేని హోదా ఇప్పుడు చంద్రబాబు ఎలా సాధించగలరని ప్రశ్నించారు. కార్యక్రమంలో నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, గుంటూరు భారతి, వుడా మాజీ చైర్మన్ పీఎస్ఎన్ రాజు, వేగి వెంకటేష్, కంటుమచ్చు తాతారావు, కర్రి రామారెడ్డి, ఎం సత్యనారాయణరాజు, కందుల నాగరాజు, రజియా ఖాన్, రామదాసు, వేలంగినిరావు, పర్వీన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీలకు మద్దతుగా

## అన్ని నియోజక వర్గాలలో నిరాహార దీక్షలు

- మన రాష్ట్ర అభివృద్ధికి హోదా ఒక్కటే మార్గం
- పదవులు ప్రధానం కాదు.. హెూదా సాధనే ప్రధానం
- విశాఖ పార్లమెంట్ వైకాపా అధ్యక్షుడు తైనాల విజయ్ కుమార్



విశాఖపట్నం : రాష్ట్రం కోసం పదవులను తృణప్రాయంగా వదిలివేసిన ఎంపీలకు మద్దతుగా స్థానికంగా నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు విశాఖ పార్లమెంటరీ వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు తైనాల విజయ్ కుమార్ చెప్పారు. నగర పార్టీ కార్యాలయంలో బుదవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోదా అవసరాన్ని ప్రజలకు తెలియచెప్పే ఉద్దేశ్యతో వారిని అందరినీ ఉద్యమంలో భాగస్తులను చెయ్యాలనే తలంపుతోనే ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశామన్నారు. పార్లమెంట్ ముగిసిన వెంటనే తమ పార్టీ ఎంపీలు అంతా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామాలు చేసి, నిరాహార దీక్ష చెప్పట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. మన రాష్ట్ర అభివృద్ధికి హోదా ఒక్కటే మార్గమని తమ నాయకుడు తొలుత నుండి చెబుతున్న విషయం తెలిసిందే అన్నారు. ఇప్పటి వరకు హోదా మాట ఎత్తని తెలుగుదేశం పార్టీ ఇప్పుడు హోదా కోసం అంటూ కొత్త నాటకాలు ఆడుతోందని అన్నారు. ఆ పార్టీ ఎంపీల నాటకాలకు మద్దతుగా సీఎం చంద్రబాబు వైట్ కాలర్ నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. తమ పార్టీ ఎంపీలు రాజీనామా చేసిన వెంటనే విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో అన్ని నియోజక వర్గాలలోనూ ప్రతీ రోజు నిరాహార దీక్షలు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆయా నియోజక వర్గాలలో సమన్వయకర్తల నిర్వహణలో ఈ దీక్షలు జరుగుతాయన్నారు. అలాగే తమ పార్టీ అనుభంధ సంఘాల ఆధ్వర్యంలో రోజుకో రకమైన నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు మళ్ల విజయ ప్రసాద్ మాట్లాడుతూ సీఎం ఢిల్లీ ఎందుకు వెళ్ళారో తెలియదు అన్నారు.

హోదా కోసమే ఆయన ఢిల్లీ వెళ్లి ఉంటే ఈ రోజైనా చర్చకు రావాలి కదా అన్నారు. హోదా విషయంలో తమ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అధికార పార్టీకి లేదన్నారు. ఎంపీలకు మద్దతుగా జరిగే నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశంలో సమన్వయకర్తలు వంశీ కృష్ణ , నాగిరెడ్డి, కోలా గురువులు , విజయ నిర్మల, సత్తి రామకృష్ణ రెడ్డి, సనపల చంద్ర మౌళి , ఉషా కిరణ్, అల్లు జోగి నాయుడు, అనుబంధ సంఘాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , కె ఆర్ పాత్రుడు , గరికిన గౌరి, బర్కత్ ఆలీ, కాళిదాసు రెడ్డి , బోని శివ రామకృష్ణ , షరీఫ్, రాధ, నాయుకులు జాన్ వెస్లీ తదితరులంతా పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 Phone : 2564353, Fax : 0891-2569004 e-mail: vijayabhanudaily@gmail.com

# శ్రీ సత్యదేవుని వార్షిక ఆదాయం రూ.134కోట్ల 70లక్షలు



అన్నవరం: తూ.గో. జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం 2017-2018 వార్షిక ఆదాయం గత సంవత్సరం వార్షిక ఆదాయం కంటే 12,10,34,147 రూపాయిలు అదనంగా సమకూరినట్లు అలాగే ఈ సంవత్సరం 134 కోట్ల 70 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వ్రత విభాగం నుండి రూ. 26,86, 71,788/-.లు, హుండీలు ద్వారా రూ. 13,47, 29,533/-లు, ప్రసాదం విభాగం నుండి రూ. 25,88,90,448.00/-లు, వసతి గదుల అద్దె ద్వారా రూ.8,01,15,863/-లు, దర్శనం/సేవల నుండి రూ.6,66,83,662/-లు, దుకాణాలు, ఇతర లీజుల ద్వారా రూ.11,21,61,999/-లు. రవాణా విభాగం నుండి రూ.92,94,90,883/-లు. అనుబంధ ఆలయాలు, డిపాజిట్లు పై వడ్డీ, గోల్డ్ బాండ్ పై వడ్డీ, ఫిక్సడ్ డిపాజిట్ ల పై వడ్డీ , ఇతరముల ద్వారా మొత్తం రూ.41,75,23, 130/-లు కలిపి స్థూలంగా మొత్తం ఆదాయం రూ.1,34,70,14,014/-లు వచ్చిందని దేవస్థానం అధికారులు తెలిపారు. సత్యదేవుని దేవస్థానం ఆదాయం విషయంలో ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తూ ఉండడం గమనార్హం. కాగా భక్తులకు సౌకర్యాలు కల్పనలో తగ్గుతూ వస్తుండడం కూడా ఇక్కడ గమనించవలసినది. దీనిపై దేవస్థానం ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు భక్తులు, గ్రామస్థులు కోరుతున్నారు.

# బాలిక సాదకారికతపై అవగాహన సదస్సు

యానాం: బాలిక సాదకారికత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పరంపేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారి సర్వశిక్షాభి యానాం కోఆర్డినేటర్ కమిడి ప్రభాకర్‌రావు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, మొదలగు పోటీలను నిర్వహించారు. బాలిక సాదకారితపై ఎస్ఐ బి. కనకారావు డాక్టర్ డి. శివగాయత్రి, విద్యాశాఖ అధికారి కాలే సాయినాధ్ సర్వశిక్షాభియాన్ కోఆర్డినేట్ కె. ప్రభాకరరావులు వివరాంచారు. బాలికలు విద్యలోను, దేశంఉన్నతిలోను పాల్గొనేలా చిన్న వయస్సునుండే కృషిచేయాలని పిలుపునిచ్చారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం,చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె. మురళీకృష్ణ, సీనియర్ ఉపాధ్యాయుడు ఇవివి రామణమూర్తి , బి. శ్రీనివాసరావు, వి. మహేశ్వరరావు, పి నాగేశ్వరరావు, ఎ సూర్యసుందరి, కెఎస్వి లక్ష్మి, విపిఎస్ఎం మంజరి, వ్యాయామ ఉపాధాయుడు జె. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాధనలు

రావులపాలెం: రావులపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయని డిసిఎమ్ఎస్ చైర్మన్ కె.వి. సత్యనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద బుధవారం సర్పంచ్ పోతుమూడి విజయ లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డిసిఎమ్ఎస్ చైర్మన్ కెవి సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ స్థానిక కొత్తకాలనీ ఎస్‌సి ఏరియాలో సిసి రోడ్లు నిర్మాణము, పిల్లకాలువ గట్టు రెండు వైపులా సిసిరోడ్డు నిర్మాణమునకు 1 కోటి 10 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భముగా నిధులు మంజూరుకు కృషి చేసిన సోషల్ వెల్ఫేర్ శాఖామాత్యులు నక్కా ఆనందబాబు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నియోజక వర్గ టిడిపి ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావులకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొవ్వూరి జగన్నాధరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు గుత్తుల పట్టాభిరామారావు, మండల ప్రతిపక్షనేత కుడుపూడి శ్రీనివాసరావు, ఎమ్‌పిటిసి యార్లగడ్డ సునీత, ఆత్మకమిటీ చైర్మన్ జక్కంపూడి వెంకటస్వామి, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ వెలగల శ్రీనివాసరెడ్డి, దాసరి వెంకట ప్రసాద్, చిలువూరి సతీష్ రాజు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## పాఠశాలలో బెటీబచావో, బెటీపడావో పై ప్రచారం

యానాం : వివిధ పాఠశాలలో ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలను చదివించండి అంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆడపిల్లలను పాఠశాలలో చేర్పించాలని అలాగే బడి మానకుండా, బయట తిరిగేవారిని పాఠశాలలో చేర్పించేలా కృషిచేయాలని ఆడపిల్లలకు ఉన్న చట్టాలు, హక్కుల గురించి, బాల్య వివాహ నిర్మూలనకు కృషిచేయాలని బాలికలను వేధింపులకు గురిచేస్తు విధించే శిక్షల గురించి వివరించారు. ఆడపిల్లలను సంఘంలో ఉన్నతంగా చూసేలా ప్రతిఒక్కరూ పాటుపడాలని అవగాహన కల్పించారు. సావిత్రినగర్, గిరియంపేట, దరియాలతిప్ప, పలు పాఠశాలలో బేటీబచావో, బేటీపాడావోపై విస్తృప్రచారంతోపాటు విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు బహుమతులు ప్రధానంచేశారు.

## జాతీయస్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ

తాళ్లరేవు : మార్చి 28 నుండి ఏప్రిల్ 1 వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి త్రో బాల్ పోటీలలో జి.హేమవరం పాఠశాల విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యయుడు జి. నాగేశ్వరరావు తెలిపారు. హర్యానా రాష్ట్రంలోని పానిపట్టులో జరిగిన జాతీయస్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన అనుకూలి దుర్గాప్రసాద్, ఎర్రాం నీడి నాగ శివలక్ష్మీనారాయణ, సీనియ్ విభాగంలో ప్రతిభ సాధించారన్నారు. వీరిని పిడి ఎస్ఆర్‌కెవి స్వామి, సర్పంచ్ కలవల శ్రీను, ఉపసర్పంచ్ ఎన్. శ్రీనివాసురావు, ఎంపిటిసి మందాల బాలచంద్ర, జన్మభూమి కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణలు అభినందించారు.

## సాయి వేసవి శిక్షణా శిబిరానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం : స్థానికంగా నివాసం ఉన్న విద్యార్థులకు భారతీయ క్రీడా ప్రాదికార సంస్థ (సాయి) శిక్షణా కేంద్రంలో వేసవి క్రీడా శిక్షణ పొందడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు సాయి సెంటర్ ఇన్‌ఛార్జి రాయుడు తెలిపారు. బాట్మింటన్, వాలీబాల్‌లో శిక్షణ వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, కాబాడి శిక్షణా, జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలోని ఏప్రిల్ 10 నుండి 30 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 9 లోగా సాయి శిక్షణా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పొందేందుకు వచ్చే క్రీడాకారులు, తమ స్పోర్ట్స్ కిట్లను తెచ్చుకోవాలన్నారు.

## నేడు వెన్నెలపాలెంలో దుర్గమాంబ జాతర

పరవాడ: పరవాడ మండలము వెన్నెలపాలెం అరాద్య దేవతైన దుర్గమాంబ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వహకులు తెలిపారు. వేకువజాము నుండి అమ్మవారు అలయంవద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని సాయంత్రము నాలుగు గంటలు బారీ మందుగుండుతో అమ్మవారిని గ్రామపుర వీదిలో ఊరేగించి అనుపుత్సోవము కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహికులు తెలిపారు.

## పేదల సంక్షేమమే టిడిపి ప్రభుత్వ లక్ష్యం

అమలాపురం : రాష్ట్రంలోని పేదల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని జనుపల్లి గ్రామ సర్పంచ్ చుట్టుగుళ్ల జ్యోతి సత్తిబాబు పేర్కొన్నారు. జనుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ చుట్టుగుళ్ల జ్యోతి సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యులు ఈతకోట సత్యవతి, ఆత్మా చైర్మన్ లింగోలు పెదకాపు ఆధ్వర్యంలో జనుపల్లిలో నూతనంగా మంజూరు కాబడిన ఎన్‌టిఆర్ భరోసా పింఛను లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేమన బాబూరావు, వార్డు సభ్యులు, జన్మభూమి కమిటీ సభ్యులు వేమన అన్నవరం, గెడ్డం త్రిమూర్తులు, గ్రామ పెద్దలు వేమన సూరిబాబు, కొలిశెట్టి రామచంద్రరావు, ఈతకోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసాధికార సర్వే మరియు ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఆర్.డి.వో రఘుబాబు



కాకినాడ : డివిజన్ నందు గల కాకినాడ రూరల్ మండలము నందు గల గంగనాపల్లి, కొవ్వాడ, చీడిగ, గ్రామముల నందు జరుగుచున్న ప్రజా సాధికార సర్వే నందు ఈ.కె.వై.సి తో ఆధార్ అనుసంధానము కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో సర్వే జరుగుచున్న తీరును కాకినాడ ఆర్.డి.వో ఎల్.రఘుబాబు ఈ రోజు పరిశీలన చేసినారు.

ఈ.కె.వై.సి తో ఆధార్ అనుసంధానము గ్రామ పంచాయితీ కార్యాలయములో కూడా నమోదు చేయుటకు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను, గ్రామ పంచాయితీ కార్యదర్శిలను ఆదేశించారు. కాకినాడ రూరల్ మండలము నందు సుమారు ముప్ఫై మూడు వేలు ఈ.కె.వై.సి తో ఆధార్ అనుసంధానము చేయాలని తెలిపియున్నారు. అదే విధముగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగముగా కొవ్వాడ గ్రామము నందు నిర్మాణములో ఉన్న సేంద్రియ ఎరువుల నిర్వహణ ఘన వ్యర్ధాల నిర్మాణ కేంద్రాన్ని పరిశీలించి తొందరగా నిర్మాణము జరిపి వినియోగములోకి తీసుకురావాలని ఆర్.డి.వో ఎల్.రఘుబాబు ఆదేశించియున్నారు. ఈ పర్యటనలో ఆర్.డి.వో వెంట కొవ్వాడ గ్రామ సర్పంచ్ సలాది సత్యవతి, గ్రామ రెవిన్యూ అధికారి కె.వి.వి.సత్యనారాయణ, గ్రామ పంచాయితీ కార్యదర్శి బొబ్బిలి గోవిందరాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# పరవాడలో రక్తదానం, కంటివైద్య శిబిరాలు

పరవాడ: ఉచిత మెగా కంటి వైద్య శిబిరం మరియు రక్త దాన శిబిరం ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంఘము పరవాడ వారి ఆధ్వర్యములో నేడుపరవాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాటశాల నందు నిర్వహించనున్నట్లు సంఘము అధ్యక్షులు ఆదిరెడ్డి సన్నిబాబు ఒకప్రకటనలో తెలిపారు. కంటి సమష్యలతో బాధపడుతున్న పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగము చేసుకోవాలని కోరారు. శంకర్ ఫౌండేషన్ విశాఖపట్నం వైద్యులచే శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పెర్కొన్నారు. ఈ శిబిరాన్ని స్దానిక శాసనసభ్యుబు బండారు సత్యనారయణ మూర్తి ముఖ్యఅతిథిగా హజరై అతని చేతులుమీదగా ప్రారంభిస్తారని అయనతెలిపారు.

# మండలంలో దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమం



రావులపాలెం : మండల పరిధి కొమరాజు లంక, దేవరపల్లిలో దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమం ఆయా గ్రామ సర్పంచ్‌లు గాడి ఝాన్సీ, కడలి లచ్చన్న, కుడిపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ టిడిపి ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు ముఖ్య అతిధిగా పాల్గొనగా కొమరాజులంక దళితపేటలో జరిగిన కార్యక్రమానికి మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గాడి క్రిష్టాఫర్ పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్వర్గీయ కోరం జయకుమార్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేసారు. బండారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితుల పక్షపాతి అని, దళితుల అభివృద్ధి అనేక సంక్షేమ పథకాలు చేపట్టారని, దళితుల అభివృద్ధి ఒక్క మన ముఖ్యమంత్రి వల్లే సాధ్యమని అన్నారు. అనంతరం దళిత వాడల్లో తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏనుగుపల్లి వెర్రియ్య, కోనాల వెంకటరావు, పోతుమూడి విజయలక్ష్మి, గుత్తుల పట్టాభిరామారావు, కుడుపూడి శ్రీనివాస్, సయ్యపరాజు జనార్ధనరాజు, జక్కంపూడి వెంకటస్వామి, గుత్తుల ఏడుకొండలు, దోనెపూడి దుర్గ, తాడి లక్ష్మి దుర్గ, యార్లగడ్డ సునీతా సుధాకర్, మాసాబత్తుల ఆనంద్, పల్లికొండ సుధీర్, బీర ఇస్సాకు, పాలింగి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక హోదా కోసం ప్రత్యేక పూజలు



విశాఖపట్నం : ఉత్తర నియోజకవర్గం 39 వ వార్డ్ మహిళా అధ్యక్షురాలు పప్పల సునీత ఆద్వర్యంలోఆంధ్రప్రదేశ్ ప్రత్యేకహోదా కావాలని కోరుతూ ఉత్తర నియోజకవర్గ మాధవధార మురళి నగర్ జంక్షన్ శ్రీ కోట దుర్గమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తల్లికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేకహోదా రావాలని నినదించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధిగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త సనపల చంద్రమౌళి పాల్గొన్నారు . ఈ సందర్భాంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో చంద్రబాబు నాటకం ప్రజలందరు గమనిస్తునే ఉన్నారు. 2014 ఎన్నికల మేనిఫెస్టో లో పేర్కొన్న విధముగా రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీదేవి వర్మ రాష్ట్ర మహిళ కార్యదర్శి రొయ్యవెంకట రమణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.సెల్ ,సిటీ కార్యవర్గ కార్యదర్సి పైడి ప్రతాప్, బుడుమూరు తిరుమలరావు, పైడి కృష్ణారావు, మైనారిటీ అధ్యక్షురాలు కొండపల్లి చిట్టి తల్లి(సోనీ) తదితరులు పాల్గొనారు.

# యధేచ్ఛగా 24 గంటలు మద్యం వ్యాపారం


## కన్నెత్తి చూడని సంబంధిత శాఖాధికారులు



పిఠాపురం : ప్రజా అవసరాలకు అవసరమైన నిత్యవసర వస్తువులు, మందులు షాపులు కూడా సమయం దాటితే మూత పడతాయి. కానీ మద్యం షాపులు మాత్రం 24 గంటలు తెరిచే ఉంచుతున్నారు మద్యం వ్యాపారులు. మెయిన్ షట్టర్లు మూసివేసినా... షట్టర్లకు కన్నాలు పెట్టి మరీ మద్యం వ్యాపారాన్ని మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వ్యాపారాన్ని విస్తరింపజేస్తున్న సంబంధిత అధికారులు మాత్రం ఏమీ ఎరుగనట్టు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టంలో ఉన్న చిన్న చిన్న లుసుగులని ఆసరాగా చేసుకుని మరీ చాపక్రింద నీరులా చేతులు తడుపుతూ సాగిపోతుంది ఈ వ్యాపారం. మందు బాబుల అవసరతను ఆసరాగా చేసుకుని మద్యం వ్యాపారులు మరింతగా చెలరేగిపోతూ సమయం దాటిందంటూ బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 వరకూ అదనంగా వసూలు చేస్తూ మందుబాబుల జేబులకు చిల్లుపెట్టి మరీ వసూలు చేస్తున్నారు. అన్ని వేళలా మద్యం అందుబాటులో ఉండటంతో మందుబాబులు కూడా అర్ధరాత్రి వరకూ వీధుల్లో వీరంగం చేస్తున్నా కనీసం అడ్డుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అర్ధరాత్రివేళ మద్యం షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నా పట్టించుకోవడంలేదని, ప్రతీ చిన్న విషయాన్ని పసిగట్టే పోలీసులకు ఈ విషయం తెలియకుండా ఉంటుందా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒక ఎక్సైజ్ అధికారిని విలేఖరి ప్రశ్నిస్తూ షట్టర్లకు కన్నాలు ఉన్నాయని, సమయపాలన పాటిస్తే కన్నాలెందుకు అని ప్రశ్నిస్తే మెయిన్ షాపులకు కన్నాలుండవని, ప్రక్కనే ఉన్న పరిమిట్ రూమ్‌కు ఉంటాయని ఆ అధికారి బదులిచ్చారు. మద్యం వ్యాపారులను సంబంధిత అధికారులు వెనకేసుకు వస్తూ మాట్లాడుతున్నారంటే నెలవారీ మాముళ్ళు ఏ విధంగా చేతులు మారుతున్నాయో ఇట్టే అర్ధమౌతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యాన్ని నియంత్రించాలని మద్యపాన నిర్మూలన సమితి మరియు ఇతర సంఘాలు, మహిళలు ఎన్ని ఉద్యమాలు చేసినా రోజు రోజుకూ మద్యం వ్యాపారం పెరుగుతుందే తప్ప నియంత్రణ లోకి రావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం వ్యాపారానికి మరింతగా ప్రోత్సాహమివ్వడమేమిటని కుటుంబాలు చిన్నాభిన్నమౌతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాసప్రాంతాలకు దగ్గరలో మద్యం షాపులు వద్దని మహిళలు మరియు ఇతర వర్గాలు ఉద్యమాలు చేసినా, మాట వినని వ్యాపారులు సమయపాలన లేకుండా అర్ధరాత్రి రెండు గంటల వరకూ మద్యం లభించడం చూస్తుంటే వ్యాపారులకు పెద్దల అండదండలు ఏ విధంగా ఉన్నాయో అర్ధమౌతుందని, మద్యాన్ని నియంత్రించక పోతే భవిష్యత్తులో ముప్పుతప్పదని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులు అరెస్టు



విశాఖపట్నం: బుధవారం ఉదయం 4.30 గంటలకు గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఎయిర్‌పోర్టు పిఎస్ సిఐ మల్లా శేష, క్రైం ఎస్ఐ రవివర్మ తమ సిబ్బందితో మర్రిపాలెం ఏరియాలో ఎంక్వేరీ చెస్తుండగా ఉదయం 5 గంటల సమయంలో మర్రిపాలెం హెచ్‌పి పెట్రోల్ బంక్ దగ్గరలో ఒక ఆటోలో నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా ఉండి పోలీసులను చూసి వారిచేతిలో ఉన్న బ్యాగును ఆటో దగ్గర పడవేసి ఒకరు పారిపోగా మిగతా ముగ్గురిని సిఐ, తన సిబ్బందితో అదుపులోకి తీసుకొని పరిశీలించగ బ్యాగులో సుమారు రెండు కేజీల బరువుగల మూడవ నెంబర్ గంజాయి పేకట్లు, ఆటోలో రెండుకేజీల ఆరవ నెంబర గంజాయి ప్యాకెట్లు దొరికాయి. పట్టుబడ్డ ముగ్గురు విశాఖపట్నం జిల్లా జి.మాడుగు (మం) సరియపల్లి గ్రామానికి చెందిన కె. రామచంద్రరావు (24), బి. చిట్టిబాబు (19), కె. రామకృష్ణ (19) లు అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని పాడేరు ఏజెన్సీ నుండి తక్కువ ధరకు కొని విశాఖపట్నం సిటీలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు చెప్పగా సిఐ సెర్చి ప్రొసీడింగ్స్ తెలియపరిచి వారి అంగీకారంతో కెజిహెచ్ సిఎంఒ వారి ఎదుట సోదాచేసి వారి వద్దనుండి రెండు కేజీల 9వ నెంబర్ గంజాయితో మొత్తం 18 కేజీల బరువుగల గంజాయిని, రెండు సెల్‌ఫోన్‌లను, ఆటోను స్వాధీన పర్చుకుని, వారిని అరెస్టుచేసి రిమాండు నిమిత్తం కోర్టుకు పంపించారు. సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై పోలీసు కమీషనర్ సిఐని వారి సిబ్బందిని ప్రశంశించారు.